# శుభోదయం

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 01, సంచిక : 210, పేజిలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు ( 9491020055) శుక్రవారం - 11 - అక్టోబర్ - 2024


## సాహిత్యంలో హాన్ కాంగ్‌కు నోబెల్ బహుమతి..



ఢిల్లీ : స్వీడిష్ అకాడమీ దక్షిణ కొరియా రచయిత్రి హాన్ కాంగ్‌కు సాహిత్యంలో 2024 నోబెల్ బహుమతిని ప్రదానం చేసింది. 2023 సంవత్సరంలో నోబల్ బహుమతి రచయిత జాన్ ఫోసె అందుకున్న సంగతి తెలిసిందే. దక్షిణ కొరియాలోని గ్వాంగ్జులో 1970లో జన్మించిన హాన్ కాంగ్ తన రచనలతో అంతర్జాతీయంగా ప్రశంసలు పొందింది.

## జమిలి ఎన్నికల ఆలోచనను విరమించుకోండి: కేరళ తీర్మానం



గురువారం కేరళ అసెంబ్లీలో సీఎం పినరయి విజయన్ ప్రభుత్వం తీర్మానం

స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రతిపాదనను కేంద్రంతో పాటు రాష్ట్రాలూ ఆమోదించాల్సి ఉంటుంది

## రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా నిర్బంధాలతో నడుస్తోంది: మంద కృష్ణ మాదిగ



మాదిగలను నమ్మించేందుకు సీఎం ఎన్నో ప్రకటనలు చేస్తున్నారని విమర్శ

సీఎం ప్రకటలను నమ్మే పరిస్థితి లేదని వ్యాఖ్య

సీఎం అసెంబ్లీలో చెప్పిన మాటలకే విలువ లేకుండా పోయిందని మండిపాటు

## ప్రధాని మోడీ వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా ఫైర్



- కాంగ్రెస్ ను విద్వేషాల ఫ్యాక్టరీ అని మోదీ అనడం దొంగే దొంగ దొంగ అని అరిచినట్లుంది
- కాంగ్రెస్ పై మోడీ విమర్శల తీరు పచ్చ కామెర్ల రోగికి లోకమంతా పచ్చగా కనిపించిన తీరుగా ఉంది
- 2029లో దేశాన్ని కాంగ్రెస్ నిలబెడుతుందని, ప్రధానిగా రాహుల్ గాంధీని దేశం చూడబోతుందని విశ్వాసం వ్యక్తం

# ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో జోరుగా జీరో దందా...

అటెండెన్స్ లేకుండానే కాంటాలు ప్రారంభించిన దడువాయిలు

ప్రేక్షక పాత్ర వహించిన మార్కెట్ ఉన్నతాధికారి..



ఖమ్మం జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 10, (శుభోదయం న్యూస్): ఖమ్మం మిర్చి మార్కెట్ జీరో దందా మూడు పువ్వులు ఆరు కాయల మాదిరి నా భూతో నా భవిష్యతి అన్న చందం.చరిత్రలో కనీవిని ఎరుగని రీతిలో హాజరు కాకుండానే కాంటాలు నిర్వహించారు.మార్కెట్ బైలా ప్రకారం ప్రతి రోజు 7.30 నిమిషాలకు దడువాయిలకు అటెండెన్స్ నిర్వహించాల్సిన మార్కెట్ అధికారులు ఈ రోజు నిర్వహించకపోవడం,హాజరు కు వచ్చినట్టే వచ్చి హాజరు పట్టిక లో సంతకాలు పెట్టకపోవడం,86 మంది దడువాయిలుండగా హాజరు కు కొద్ది మందే రావడం,వచ్చి కూడా సంతకాలు పెట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. మిగతా..2లో

## రాష్ట్రాలకు పన్నుల వాటా విడుదల చేసిన కేంద్రం... ఏపీ, తెలంగాణకు ఎంతంటే...!



- ఈసారి రూ.1,78,173 కోట్ల మేర పన్నుల వాటా విడుదల చేసిన కేంద్రం
- ఏపీకి రూ.7,211 కోట్లు... తెలంగాణకు రూ.3,745 కోట్లు విడుదల
- అత్యధికంగా యూపీకి రూ.రూ.31,962 కోట్లు

## కొండా సురేఖపై పరువు నష్టం దావా వేసిన కేటీఆర్



హైదరాబాద్ : మంత్రి కొండా సురేఖపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరువు నష్టం దావా వేశారు. గురువారం నాంపల్లి ప్రత్యేక కోర్టులో ఆయన తరపు న్యాయవాది ఉమామహేశ్వరరావు దీనికి సంబంధించిన పిటిషన్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ నేతలు బాల్క సుమన్, సత్యవతి రాథోడ్, తుల ఉమా, దాసోజు శ్రవణ్‌ను సాక్షులుగా ఉన్నట్లు తెలిపారు. కాగా, దీనిపై విచారణను అక్టోబర్ 14కు వాయిదా వేసింది కోర్టు. ఇటీవల కొండా సురేఖ మీడియాతో మాట్లాడుతూ సినీరంగంలోని పలు వురిని ప్రస్తావిస్తూ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. దీంతో కేటీఆర్ ఆమెకు లీగల్ నోటీసులు పంపారు. తనపై మంత్రి చేసిన ఆరోపణలను కేటీఆర్ ఖండించారు. తనకు సంబంధం లేని ఫోన్ ట్యాపింగ్ పై అసత్యాలు మాట్లాడారని మండిపడ్డారు.

# పవన్ కి జాతీయ ఇమేజ్ వచ్చిందా ?



పొత్తులో తీసుకున్న 21 సీట్లనూ గెలుచుకుని బలమైన ప్రాంతీయ పార్టీగా ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి పదవి కూడా లభించింది

పవన్ ని జాతీయ స్థాయిలో వేరే పొలిటికల్ లుక్ లో నిలబెట్టాయి దానిని చూసిన మీదటనే వైసీపీ నుంచి కూడా చేరికలు పెద్ద ఎత్తున కనిపిస్తున్నాయి

అమరావతి : జనసేన ఒక ప్రాంతీయ పార్టీ. పదేళ్ల క్రితం పెట్టిన పార్టీకి 2024లో అపూర్వ విజయం దక్కింది. పొత్తులో తీసుకున్న 21 సీట్లనూ గెలుచుకుని బలమైన ప్రాంతీయ పార్టీగా మిగతా..2లో

## సచివాలయాల బాధ్యత ఎవరిది... కూటమి డెసిషన్ అదే ?




అమరావతి : వైసీపీ అపర సృష్టి అయిన సచివాలయ వ్యవస్థను ఏమి చేయాలి అన్నది ఆలోచించు కునేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వానికి నాలుగు నెలల సమయం పట్టింది. గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగే మంత్రివర్గ సమావేశంలో ఏపీలోని సచివాలయాల విషయంలో కీలకమైన నిర్ణయం తీసుకుంటుంది అని అంటున్నారు. ఏపీలో లక్షా పాతిక వేలమంది పనిచేసే సచివాలయాలు ఏకంగా పదిహేను వేల దాకా ఉన్నాయి. వీటిలో ఒక్కో దానిలో పది మంది దాకా సిబ్బంది పనిచేస్తున్నారు. అక్టోబర్ 2021 నాటికి, 15,004 గ్రామ, వార్డు సచివాలయాలు 2,54,832 వాలంటీర్లతో సేవలను ప్రారంభించింది. దాదాపు 3.2 కోట్ల మందికి సేవ చేయడానికి పెన్షన్‌లు, నెలవారీ ప్రభుత్వ పథకాలతో సహా అందించేందుకు మిగతా..2లో

## ఏపీలో పరాకాష్టకు చేరిన టీడీపీ ఎమ్మెల్యేల అవినీతి : ఎంపీ విజయసాయి రెడ్డి



- చంద్రబాబు ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేక ప్రభావం కనిపిస్తుంది
- ఐదు సంవత్సరాల తర్వాత అవకాశం దొరికినప్పుడు మేం మింగితే తప్పేమిటి
- టీడీపీ ఎమ్మెల్యేలపై వస్తున్న ఆరోపణలపై చంద్రబాబు స్పందించి సమాధానం చెప్పాలని డిమాండ్

# వ్యాపార రంగంలో రతన్ టాటా వంటి వారు ఎంతో అరుదు: సీఎం చంద్రబాబు




ఢిల్లీ : ముంబయిలో రతన్ టాటా భౌతికకాయానికి ఏపీ సీఎం చంద్రబాబు పుష్పాంజలి ఘటించారు. తన కుమారుడు, మంత్రి నారా లోకేశ్ తో కలిసి ముంబయిలోని నారిమన్ పాయింట్ మిగతా..2లో



- ముంబయిలో రతన్ టాటా భౌతికకాయానికి నివాళులు అర్పించిన చంద్రబాబు
- ఆయనతో తన సాన్నిహిత్యాన్ని గుర్తుచేసుకున్న ఏపీ సీఎం
- డబ్బు సంపాదించడమే కాకుండా, ఆ డబ్బును ప్రజలకు ఖర్చు చేశారని వెల్లడి

## రెపో రేటుపై ఆర్బీఐ కీలక నిర్ణయం.. మీ లోన్ ఈఎంఐ పెరుగుతుందా? తగ్గుతుందా?



- గవర్నర్ శక్తికాంత దాస్ ఈసారి కూడా పాలసీ రేట్లలో (రెపో రేటు) ఎలాంటి మార్పు చేయలేదు
- రివర్స్ రెపో రేటు 3.35% వద్ద, బ్యాంక్ రేటు 6.75% వద్ద స్థిరంగా ఉంచుతూ నిర్ణయం
- ఇప్పుడు విధాన వైఖరిని ఉపసంహరణ సిఫార్సు నుండి తటస్థంగా మార్చినట్లు ఆర్‌బిఐ గవర్నర్

ఢిల్లీ : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 51వ మానిటరీ పాలసీ కమిటి సమాశం ఫలితాలను ప్రకటించింది ఆర్బీఐ. రెండు రోజుల మానిటరీ పాలసీ కమిటీ సమావేశ మిగతా..2లో

శుభోదయం
శుక్రవారం - 11 - అక్టోబర్ - 2024

## వ్యాపార రంగంలో రతన్ టాటా వంటి వారు ఎంతో అరుదు: సీఎం చంద్రబాబు

మొదటి పేజి తరువాయి

వద్దకు విచ్చేసిన చంద్రబాబు... రతన్ టాటా భౌతికకాయానికి నివాళులు అర్పించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆ మహోన్నత వ్యాపారవేత్తతో తన సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. రతన్ టాటా ఒక అద్భుతమైన వ్యక్తి అని అభివర్ణించారు. ఆయనతో తనకు ఎంతో సాన్నిహిత్యం ఉందని వెల్లడించారు. ఆయన ఎల్లప్పుడూ దేశం గురించే మాట్లాడేవారని, తన చేతల ద్వారానూ ఆ విషయాన్ని నిరూపించుకున్నారని చంద్రబాబు వివరించారు. వ్యాపార రంగంలో రతన్ టాటా వంటి వారు అరుదుగా కనిపిస్తుంటారని పేర్కొన్నారు. ఓవైపు వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తూనే, మరోవైపు తన జీవితాంతం సామాజిక కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు. ప్రపంచ ముఖచిత్రంపై భారత్ కనిపించేలా చేశారని, ఓ పారిశ్రామికవేత్తగా ఆయనకు అమోఘమైన విజన్ ఉందని చంద్రబాబు తెలిపారు. 100 దేశాల్లో టాటా గ్రూపు విస్తరించిందంటే అందుకు రతన్ టాటా కార్యదీక్షే కారణమని అన్నారు. ఏ అంశంలో చూసినా ఏదో ఒక టాటా సంస్థ కనిపిస్తుందని, రతన్ టాటా గొప్పదనం గురించి వివరించడానికి అదే నిదర్శనమని పేర్కొన్నారు. డబ్బు సంపాదించడమే పరమావధిగా పెట్టుకోకుండా, నైతిక బాధ్యతగా ఆ డబ్బును ప్రజల కోసం ఖర్చు చేయడం రతన్ టాటా మంచి మనసును చాటుతుందని వివరించారు. తిరుపతిలో క్యాన్సర్ ఆసుపత్రి ప్రారంభించాలని కోరితే, వెంటనే ఆ పని చేశారని చంద్రబాబు వెల్లడించారు. హైదరాబాదులోని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి కూడా ఆర్థికసాయం చేశారని తెలిపారు. రతన్ టాటా భావజాలం ఎప్పటికీ నిలిచి ఉంటుందని అన్నారు. యావత్ పారిశ్రామిక రంగాన్ని ఒక వ్యక్తి ఎలా మార్చివేశాడన్న దానికి రతన్ టాటానే ఉదాహరణ అని కీర్తించారు. అటువంటి మహనీయుడైన రతన్ టాటా మరణం తీరని లోటు అని పేర్కొన్నారు. ఆయన ఘనతర వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉందని పిలుపునిచ్చారు.

## రెపో రేటుపై ఆర్బీఐ కీలక నిర్ణయం.. మీ లోన్ ఈఎంఐ పెరుగుతుందా? తగ్గుతుందా?

మొదటి పేజి తరువాయి

ఫలితాలను ప్రకటిస్తూ సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ ఈసారి కూడా పాలసీ రేట్లలో (రెపో రేటు) ఎలాంటి మార్పు చేయలేదని తెలిపారు. అంటే మీ లోన్ ఈయంఐపై పెరగదు లేదా తగ్గదు. రిజర్వ్ బ్యాంక్ రెపో రేటులో ఎలాంటి మార్పు చేయకపోవడం ఇది వరుసగా 10వ సారి. దీని తర్వాత రెపో రేటు 6.50% వద్ద కొనసాగుతుంది. రివర్స్ రెపో రేటు 3.35% వద్ద, బ్యాంక్ రేటు 6.75% వద్ద స్థిరంగా ఉంచుతూ నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 7న ప్రారంభమైన ఈ ఎంపీసీ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈసారి ముగ్గురు కొత్త సభ్యులను ఎంపీసీ, గ్లోబల్ సహా ఇతర అంశాలు చేర్చుకున్నట్లు ఆర్బీఐ గవర్నర్ తెలిపారు. 6లో 5 మంది సభ్యులు వడ్డీ రేట్లను మార్చలేదు. దీనితో పాటు, ఇప్పుడు విధాన వైఖరిని ఉపసంహరణ సిఫార్సు నుండి తటస్థంగా మార్చినట్లు ఆర్బిఐ గవర్నర్ తెలిపారు. ప్రపంచ స్థాయిలో అస్థిర పరిస్థితులు నెలకొన్నప్పటికీ దేశంలో ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడంలో విజయం సాధించామని, దీనితో పాటు ఆర్థిక వృద్ధి కూడా ఊపందుకున్నదని చెప్పారు.

ఈయంఐపై రెపో రేటు ప్రభావం:

ఈ సమావేశం ప్రతి రెండు నెలలకోసారి జరుగుతుంది. రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్‌తో సహా ఆరుగురు సభ్యులు ద్రవ్యోల్బణం, ఇతర సమస్యలు, మార్పుల గురించి చర్చిస్తారు. బ్యాంకు రుణాలు తీసుకునే కస్టమర్లతో రెపో రేటుకు ప్రత్యక్ష సంబంధం ఉంది. దాని తగ్గుదల కారణంగా, రుణ ఈయంఐ తగ్గుతుంది మరియు దాని పెరుగుదల కారణంగా, అది పెరుగుతుంది. వాస్తవానికి, రెపో రేటు అనేది ఏదైనా నిధుల కొరత ఏర్పడినప్పుడు ఒక దేశం యొక్క సెంట్రల్ బ్యాంక్ వాణిజ్య బ్యాంకులకు రుణం ఇచ్చే రేటు. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడానికి ద్రవ్య అధికారులు రెపో రేటును ఉపయోగిస్తారు.

## సాహిత్యంలో హాన్ కాంగ్‌కు నోబెల్ బహుమతి..

మొదటి పేజి తరువాయి

హాన్ కాంగ్ 1970లో దక్షిణ కొరియాలోని గ్వాంగ్జులో జన్మించారు. ఆమె సాహిత్య నేపథ్యం నుంచి వచ్చింది .ఆమె తండ్రి కూడా ప్రసిద్ధ నవలా రచయిత కావడం విశేషం. ఆమె 1993లో మున్వాక్-గ్వా-సాహెూ (సాహిత్యం-సమాజం) శీతాకాల సంచికలో "వింటర్ ఇన్ సియోల్"తో సహా ఐదు కవితలను ప్రచురించి కవయిత్రిగా తన సాహిత్య రంగ ప్రవేశం చేసింది. ఆమె ఫ్రూట్స్ ఆఫ్ మై వుమన్ (2000), ఫైర్ సాలమండర్ (2012)బీ బ్లాక్ డీర్ (1998), యువర్ కోల్డ్ హ్యాండ్స్ (2002), ది వెజిటేరియన్ (2007), బ్రీత్ ఫైటింగ్ (2010), మరియు గ్రీక్ లెసన్స్ (2011), హ్యూమన్ యాక్ట్స్ (2014), ది వైట్ బుక్ (2016), ఐ డూ వంటి నవలలు బిడ్ ఫేర్‌వెల్ కాదు(2021). ఐ పుట్ ది ఈవినింగ్ ఇన్ ది డ్రాయర్ (2013) వంటి రచనలు చేశారు. 2016లో రచించిన 'ది వెజిటేరియన్' ఆమెకు అంతర్జాతీయ బుకర్ ప్రైజ్‌ను తెచ్చిపెట్టింది.


## జమిలి ఎన్నికల ఆలోచనను విరమించుకోండి: కేరళ తీర్మానం

తిరువనంతపురం: దేశవ్యాప్తంగా ఒకేసారి జమిలి ఎన్నికలు నిర్వహించటంపై ఆలోచనను విరమించుకోవాలని కేరళ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గురువారం కేరళ అసెంబ్లీలో సీఎం పినరయి విజయన్ ప్రభుత్వం తీర్మానం చేసింది. ఒకేసారి దేశవ్యాప్తంగా ఎన్నికలు నిర్వహించడం అప్రజాస్వామికం, దేశ సమాఖ్య నిర్మాణానికి హానికరమని తీర్మానంలో పేర్కొన్నారు. కొన్నేళ్ళుగా చెబుతూ వస్తున్న 'ఒకే దేశం... ఒకే ఎన్నిక' ప్రతిపాదనపై కేంద్రంలోని అధికార బీజేపీ ఇటీవల మరో అడుగు ముందుకు వేసింది. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సారథ్యంలోని కమిటీ ఈ ప్రతిపాదనపై ఇచ్చిన నివేదికను ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర మంత్రివర్గం లాంఛనంగా ఆమోదం తెలిపింది. ఈ ప్రతిపాదనపై ఓ బిల్లును రానున్న పార్లమెంట్ శీతకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నట్టు భోగట్టా. ఈ ప్రతిపాదనకు పార్లమెంట్‌లో మూడింట రెండొంతుల మెజారిటీతో రాజ్యాంగ సవరణలు అవసరం. అలాగే స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రతిపాదనను కేంద్రంతో పాటు రాష్ట్రాలూ ఆమోదించాల్సి ఉంటుంది. వెరసి, రాజ్యాంగపరంగానూ, ఆచరణలోనూ అనేక అవరోధాలున్న ఈ ప్రతిపాదనపై రాగల నెలల్లో పెద్దయెత్తున రచ్చ రేగడం ఖాయం.

## రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా నిర్బంధాలతో నడుస్తోంది: మంద కృష్ణ మాదిగ

బీఆర్ఎస్ ప్రభుత్వమే కాదు... ఇప్పటి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా నిర్బంధాలతోనే నడుస్తోందని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ విమర్శించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మాదిగలను నమ్మించేందుకు ముఖ్యమంత్రి ఎన్నో ప్రకటనలు చేస్తున్నారని, కానీ వాటిని నమ్మే పరిస్థితి లేదన్నారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేయకుండానే 11 వేలకు పైగా ఉపాధ్యాయ నియామకాలు భర్తీ చేశారన్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో, ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్లకు కూడా వర్గీకరణను వర్తింపజేస్తామని చెప్పిన సీఎం... అమలు చేయకుండానే పోస్టులను భర్తీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి అసెంబ్లీలో చెప్పిన మాటలకే విలువ లేకుండా పోయిందన్నారు. గ్రూప్ 1, గ్రూప్ 2 పరీక్షలకు వర్గీకరణను వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే వర్గీకరణ తర్వాతే పరీక్షలు నిర్వహించాలన్నారు. గ్రూప్ 4 ఫలితాలు ఇప్పటికే 16 నెలలు ఆగిపోయాయని, వర్గీకరణ జరిగే వరకు మరో రెండు నెలలు వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు. కమిటీల పేరుతో కాలయాపన చేసి, కమిషన్ల పేరుతో జాప్యం చేసి, ఉన్న ఉద్యోగాలను కొల్లగొడుతామంటే మాదిగ జాతి ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఈ నెల 16న వరంగల్‌లో భారీ సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆ సమావేశంలో ఎమ్మార్పీఎస్ కు చెందిన అన్ని కమిటీల సభ్యులు పాల్గొంటారని వెల్లడించారు.

## రాష్ట్రాలకు పన్నుల వాటా విడుదల చేసిన కేంద్రం... ఏపీ, తెలంగాణకు ఎంతంటే...!



ఢిల్లీ : కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రాలకు పన్నుల వాటా విడుదల చేసింది. రాష్ట్రాల అభివృద్ధి, మూల ధన వ్యయానికి ఊతమిచ్చేందుకు ఈ నిధులు ఉపయోగపడతాయని కేంద్రం భావిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాలకు అందించే నెలవారీ పన్నుల వాటా రూ.89,086.50 కోట్లు కాకుండా... ఈసారి రూ.1,78,173 కోట్ల మేర పన్నుల వాటా విడుదల చేసినట్టు కేంద్ర ప్రభుత్వం నేడు ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇందులోనే ఒక నెల ముందస్తు చెల్లింపు (అడ్వాన్స్ పేమెంట్)ను కూడా చేర్చినట్టు వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పన్నుల వాటా రూపంలో రూ.7,211 కోట్లు దక్కనుండగా... తెలంగాణకు రూ.3,745 కోట్లు లభించనున్నాయి. అత్యధికంగా ఉత్తరప్రదేశ్ కు రూ.31,962 కోట్ల మేర పన్నుల వాటా కేటాయించారు. బీహార్ కు రూ.17,921 కోట్లు, మధ్యప్రదేశ్ కు 13,987 కోట్లు, మహారాష్ట్రకు రూ.11,255 కోట్లు, పశ్చిమ బెంగాల్ కు రూ.13,404 కోట్లు, రాజస్థాన్ కు రూ.10,737 కోట్లు, ఒడిశాకు రూ.8,068 కోట్లు పన్నుల వాటా రూపేణా దక్కనున్నాయి.

# పవన్ కి జాతీయ ఇమేజ్ వచ్చిందా ?

మొదటి పేజి తరువాయి



ఏపీలో కుదురుకుంది. దాని ఫలితంగా ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి పదవి కూడా లభించింది. అంతే కాదు విశేషమైన అధికారం కూడా దక్కింది. దానిని చూసిన మీదటనే వైసీపీ నుంచి కూడా చేరికలు పెద్ద ఎత్తున కనిపిస్తున్నాయి. అలా తన పార్టీని ఏపీలో బలోపేతం చేసుకుని 2029 నాటికి జనసేనను ఏపీలో గట్టిగా నిలబెట్టాలని పవన్ సంకల్పంతో ఉన్నారు అని అంటున్నారు. అయితే సడెన్ గా పవన్ కళ్యాణ్ జాతీయ స్థాయిలో మారుమోగారు. తిరుమల శ్రీవారి లడ్డూ ఇష్యూని చంద్రబాబు లేవనెత్తినా దాని వల్ల పొలిటికల్ గా దూకుడు చేసి జాతీయ మీడియాలో నానింది మాత్రం పవన్ కళ్యాణే. ఆయన సనాతన ధర్మం మీద చేసిన వ్యాఖ్యలు, అలాగే సనాతన ధర్మం బోర్డుని ఏర్పాటు చేయాలని చేసిన డిమాండ్, తిరుపతిలో వారాహి డిక్లరేషన్ పేరిట ఆయన చేసిన గర్జన ఇవన్నీ కూడా పవన్ ని జాతీయ స్థాయిలో వేరే పొలిటికల్ లుక్ లో నిలబెట్టాయి. నిజానికి హిందూత్వ అన్నది బీజేపీకి ఉన్న పేటెంట్ రైట్. ఆ వైపు మిగిలిన పార్టీలు చూడవు, ట్రై చేయవు. ఇపుడు అదే బాటలో పవన్ పయనిస్తున్నట్లుగా ఉందని అంటున్నారు. పవన్ హిందువుల కోసం చేసిన వ్యాఖ్యలు కానీ సనాతన ధర్మం మీద ఆయన చేసిన హాట్ కామెంట్స్ కానీ నేషనల్ మీడియాలో బిగ్ డిబేట్ కి కారణం అయ్యాయి. అలా పవన్ సౌత్ నుంచి హిందూత్వ ఐకాన్ గా న్యూ అవతార్ గా మారారని అంటున్నారు. ఈ పరిణామాలు సహజంగా బీజేపీలో కొత్త ఉత్సాహాన్ని సరికొత్త ఆశలను లేవనెత్తాయని అంటున్నారు. సౌత్ లో పవన్ పాపులర్ సినీ హీరో. అలాగే బలమైన సామాజిక వర్గానికి చెందిన నాయకుడు. ఆ విధమైన సామర్థ్యం కలిగిన పవన్ సనాతన ధర్మం పేరుతో బిగ్ సౌండ్ చేయడం బీజేపీకి కొత్త నేస్తాన్ని అందించినట్లు అయింది. పవన్ ఇప్పటికే బీజేపీకి మిత్రుడు. ఇపుడు ఐడియాలజీ పరంగా కూడా ఇంకా దగ్గర అయ్యారని అంటున్నారు. రానున్న రోజులలో పవన్ ఇదే రకమైన సీరియస్ నెస్ తో పనిచేస్తారని కూడా నమ్ముతున్నారు. ఆయన వెనక బీజేపీ వారు ఉన్నారా అన్నది ప్రత్యర్థుల అనుమానం అయితే కావచ్చు కానీ పవన్ లో ఒక్కసారి కనిపించిన ఈ ఫైర్ ని మాత్రం ఆరిపోనీయకుండా దానితోనే కొత్త రాజకీయ కాంతులు చూసుకుంటూ ఆ వెలుగులో తన రాజకీయ లక్ష్యాలను పండించుకోవాలని బీజేపీ తప్పకుండా చూస్తుంది అని అంటున్నారు. పవన్ సైతం బలమైన హిందూత్వ వాదంతో తనకు లభించిన ఈ జాతీయ ఇమేజ్ ని అంత సులువుగా వద్దు అనుకోరని, ఆయన వ్యూహాలు రాజకీయాలు కూడా ఇక మీదట జాగ్రత్తగా గమనించాల్సిందే అని అంటున్నారు. మొత్తానికి శ్రీవారి లడ్డూలలో కల్తీ అని చంద్రబాబు లేవనెత్తిన ఇష్యూ కాదు కానీ పవన్ మాత్రం నేషనల్ ఫిగర్ అయిపోయారు అని అంటున్నారు. బీజేపీకి కూడా ఇపుడు పవన్ ని చూసి పూర్తి ధీమా వచ్చిందని అంటున్నారు. దీనిని బట్టి చూస్తే రాజకీయ పరిణామాలు రానున్న రోజులలో ఏ మలుపు తిరుగుతాయన్నది వేచి చూడాల్సిందే అని అంటున్నారు.

# ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో జోరుగా జీరో దందా...

మొదటి పేజి తరువాయి




ఈ తతంగామ్ అంతా కూడా మార్కెట్ ఉన్నతాధికారి కనుసన్నల్లో నడవడం కొసమెరుపు.

**అసలు దడువాయి కి మార్కెట్ కు ఉన్న అనుబంధం,సంబంధం ఏంటి..?దడువాయి విధులు ఏంటి...?**

మార్కెట్ కార్యదర్శి సమక్షంలో హాజరై ,కాంటాలు మోసుకొచ్చి జెండా పాటా కాగానే కాంటాలు చేయాలి.ఇది వారి డ్యూటీ.రైతుకు,కమిషన్ దారుకు మధ్యనే ఉండాల్సిన దడువాయిలు కొనుగోలు దారుతో ములాఖత్ అయ్యి జీరో దందా కు తెరలేపారనే ఆరోపణలు ఉన్నాయి. కమీషన్ దారు వద్ద ఒక బస్తా కాంటా వేస్తే 5.40 పైసలు తీసుకుంటూనే కొనుగోలు దారుడివద్ద జీరో సరకు కాంట వేసినందుకు 10 రూ. %=ఐ% కాంట వేసినందుకు 5 రూ.మొత్తంగా 20.40 పైసలు వసూల్ చేస్తున్నారు.అంటే ఒక బస్తాకు 20.40 పైసలన్నమాట.అంటే సీజన్ లో రోజుకు లక్షా యాభై వేల బస్తాలు వెరసి 30,60,000 అంటే సగటున ఒక్కో దడవాయికి 35వేల పైమాటే.దానిలో సగం మాకు సగం మీకు అన్నమాట.కేవలం ఇది కంటాలకు సంబంధించిన లెక్క మాత్రమే.సీజన్ లో ఓ రైతు 20 బస్తాలు కాంటా పెడితే 10 బస్తాలకే టాక్స్ అన్నమాట.ఓ సీజన్ లో ఎంత మార్కెట్ వ్యాపారం నడిస్తే దానిలో సగం మాత్రమే రికార్డుల్లోకి ఎక్కుతుంది.మిగతా లెక్కలు గాంధీ గారి డైరీ లో ఉంటాయన్న మాట... దీనిలో మార్కెట్ అధికారులకూ వాటాలున్నాయనే బలమైన ఆరోపణలున్నాయి.ఇవన్నీ రైతు నెత్తిన మరియు ప్రభుత్వానికొచ్చే ఆదాయానికి పెట్టె కుచ్చు టోపీనే.ఆరుగాలం కష్టపడ్డ రైతులను,నిద్రాహారాలు మాని ఒళ్ళు హూనం అయ్యేలా శ్రమ చేస్తున్న హమాలీ లను దోచుకుంటున్నారనే ఆరోపణలూ ఉన్నాయి.పొద్దంత కష్టం చేసిన హమాలీలకు 500 నుంచి 800 రూపాయల లోపే.అదే దడువాయి సాయంత్రానికి దరిద్రానికి 5000 జేబులో వేసుకుంటున్నాడంటే ఏ స్థాయిలో దోపిడీ ఉందో చెప్పొచ్చు. దడువాయిలు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తే తాము బ్రతకడం తో పాటు రైతుకు మేలు చేస్తూనే ప్రభుత్వానికి భారీ ఆదాయం చేకూర్చే అవకాశం లేకపోలేదు.కానీ కొనుగోలు దారుతో చేతులు కలిపి రైతుకంట్లో కారం కొట్టి రైతును నట్టేట ముంచడమే కాకుండా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని కొనుగోలు దారులు,దడువాయిలు కలిసి గండి కొడుతున్నారు. వారసత్వాన్గా చేసుకోవాల్సిన దడువాయి పనిని అక్రమంగా లక్షల్లో అమ్మకాలు,కొనుగోళ్ళు చేసి మార్కెట్ ను మాయ చేస్తున్నారు. 86 మంది దడువాయిల్లో అక్రమాలకు పాల్పడేది కొందరేనని,వారి ఆగడాలను ప్రశ్నించి,నిఖార్సుగా పనిచేస్తున్న వారిని పలు విధాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలున్నాయి. నిఖార్సయిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కండ్లు గప్పి మార్కెట్ లో జీరో దందాకు సహకరిస్తున్న మార్కెట్ అధికారులపై చర్యలు తీసుకొని,ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కు పూర్వవైభవం తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

## సచివాలయాల బాధ్యత ఎవరిది...కూటమి డెసిషన్ అదే ?

మొదటి పేజి తరువాయి

వీటిని ఏర్పాటు చేశారు. ఈ సచివాలయాల నిర్వహణ అన్నది కూటమి ప్రభుత్వానికి భారంగా ఉంది. ఎందుకు అంటే సిబ్బంది ఎక్కువగా ఉన్నారు. పైగా ప్రతీ రెండు వేల మందికి ఒక సచివాలయం ఏర్పాటు చేశారు. దాంతో సచివాలయాలలో పది మందికి ఇద్దరు ముగ్గురుకి మాత్రమే పని ఉంది అని అంటున్నారు. వీరి విషయంలో ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం తేల్చబోతోంది. సచివాలయాలను పంచాయతీలను అప్పగించాలని అనుకుంటోందిట. ఆ విధంగా చేయడం వల్ల వీరి పనితీరు మీద అజమాయిషీ ఉంటుంది అలాగే వారి సేవలను ఏ విధంగా వాడుకోవాలో కూడా పంచాయతీలు చూసుకుంటాయని అంటోంది. మరో వైపు చూస్తే పంచాయతీలకు సమాంతరంగా సచివాలయాలను తెచ్చారని, దాని వల్ల పంచాయతీలు నిర్వీర్యం అయ్యాయని ఆరోపణలు ఉన్నాయి. అంతే కాదు సర్పంచులు ఉత్సవ విగ్రహాలుగా మారిఒపయారు అని అంటున్నారు. ఇపుడు సర్పంచులకు న్యాయం చేయడం వారికే సచివాలయాల మీద పెత్తనం అప్పగించడం చేస్తారు అని అంటున్నారు. అదే విధంగా పంచాయాతీలకే అధికారాలు నిధులు విధులు ఇవ్వడానికి కూటమి ప్రభుత్వం సిద్ధపడుతోంది. ఇక ప్రతీ రెండు వేలకు ఒక సచివాలయం కాకుండా పంచాయతీకి ఒకటి ఉంటే చాలు అన్నట్లుగా నిర్ణయం తీసుకుంటారు అని అంటున్నారు. మిగిలిన అదనపు సిబ్బందిని కూడా ఇతర ప్రభుత్వ విభాగాలలో సర్దుబాటు చేస్తారు అని అంటున్నారు. పట్టణాలో ఉండే వార్డు సచివాలయాలను కూడా సంఖ్య తగ్గించి అక్కడి సిబ్బందిని కూడా వేరే శాఖలకు సర్దుతారు అని అంటున్నారు. మొత్తానిఅక్కకి సచివాలయాల రూపు షేపూ గతంలో మాదిరిగా ఉండదని అంటున్నారు. ఇక వాలంటీర్ల విషయంలో కూడా కూటమి ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటుంది అని అంటున్నారు. వారిని ఏ విధంగా ఉపయోగించుకోవాలన్నది కూడా ఆలోచిస్తారు అని అంటున్నారు.ఏది ఏమైనా సచివాలయాలు వాలంటీర్ల పంచాయతీకి ఒక పరిష్కారం మంత్రి వర్గ సమావేశంలో దొరుకుతుంది అని అంటున్నారు.

## ఏపీలో పరాకాష్టకు చేరిన టీడీపీ ఎమ్మెల్యేల అవినీతి : ఎంపీ విజయసాయి రెడ్డి



అమరావతి : అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోను 90శాతం మంది టీడీపీ ఎమ్మెల్యేల అవినీతి పరాకాష్టకు చేరుకుందిన వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి ధ్వజమెత్తారు. చంద్రబాబు ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేక ప్రభావం కనిపిస్తుందని ఆయన ట్విట్టర్ వేదిక ద్వారా ఆరోపించారు. అధికారులు, ఉద్యోగుల పోస్టింగులకు ఒక రేటు, మద్యంలో నెలమామూళ్లు, వెంచర్లలో కమీషన్లు, కాంట్రాక్టర్ల దగ్గర పర్సెంటేజిలు, ప్రొటెక్షన్ మనీ అంటూ బరితెగించారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో టీడీపీ గూఢచారులుగా ప్రవర్తించిన అధికారులకు క్లీన్ చిట్‌లు, మంచిరాబడి ఉన్న పోస్టింగులు, పదోన్నతులు ఇస్తున్నారని మండిపడ్డారు. మద్యంషాపుల దరఖాస్తుల్లో టీడీపీ ఎమ్మెల్యేలు సిండికేట్ అయ్యి సర్కార్ ఖజానాకు గండి కొడుతున్నారని విమర్శించారు. లిటిగేషన్లు, నోటిదురుసులు, వ్యభిచారాలు, ఆమ్యామ్యాలు, మాఫియాలు, దందాలు, బ్లాక్‌మెయిలింగ్‌లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఐదు సంవత్సరాల తర్వాత అవకాశం దొరికినప్పుడు మేం మింగితే తప్పేమిటి. మళ్లీ అవకాశం వస్తుందో రాదో అన్న అనుమానంతో విచ్చలవిడితనానికి తమ్ముళ్లు ఎగబడుతున్నారని అన్నారు. టీడీపీ ఎమ్మెల్యేలపై వస్తున్న ఆరోపణలపై చంద్రబాబు స్పందించి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే ప్రజాభీష్టం మేరకు శ్వేతపత్రం సమర్పించి విచారణకు ఆదేశించాలన్నారు.

## కొండా సురేఖపై పరువు నష్టం దావా వేసిన కేటీఆర్

మొదటి పేజి తరువాయి

ఫోన్ ట్యాపింగ్ తోపాటు నాగచైతన్య, సమంత విడిపోవడానికి ప్రధాన కారణం కేటీఆర్ అంటూ దురుద్దేశపూర్వకంగా వ్యాఖ్యలు చేశారని ధ్వజమెత్తారు. కేవలం తన గౌరవానికి, ఇమేజ్‌కి భంగం కలిగించాలనే లక్ష్యంతోనే అడ్డగోలుగా వ్యాఖ్యలు చేశారని కేటీఆర్ లీగల్ నోటీసుల్లో పేర్కొన్నారు. కేవలం రాజకీయ కక్షతో, రాజకీయ ప్రయోజనాల కోసం తన పేరును కొండా సురేఖ వాడుకుంటున్నారని మండిపడ్డారు. మహిళ అయి ఉండి సాటి మహిళ పేరును, సినిమా నటుల పేరును వాడుకుని వారి వ్యక్తిత్వ హననానికి కూడా పాల్పడటం దురదృష్టకరమని ధ్వజమెత్తారు. ఒక మంత్రిగా కొండా సురేఖ తన మంత్రి హెూదాను దుర్వినియోగం చేశారని కేటీఆర్ మండిపడ్డారు. ఎలాంటి సాక్ష్యాలు లేకుండా కొండా సురేఖ చేసిన అసత్య పూరిత వ్యాఖ్యలు, దురుద్దేశ పూరిత మాటలు మీడియా, సోషల్ మీడియాలోని విస్తృతంగా ప్రచారమయ్యాయని, ఎలాంటి సాక్ష్యాధారాలు చూపించకుండా అడ్డగోలుగా మాట్లాడిన కొండ సురేఖ ఒక మంత్రి అని.. ఆమె చేసిన వ్యాఖ్యలను సాధారణ ప్రజలు నిజాలుగా భ్రమపడే అవకాశం ఉందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రిగా తన సహచర అసెంబ్లీ సభ్యుడనే సోయి లేకుండా మాట్లాడటం ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. అబద్దాలు, అసత్యాలు దురుద్దేశపూర్వకంగా మాట్లాడినందుకు బహిరంగ క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. భవిష్యత్తులోనూ ఇలాంటి దురుద్దేశపూర్వక, చిల్లర మాటలు మాట్లాడవద్దని హెచ్చరించారు. 24 గంటల్లోగా క్షమాపణ చెప్పకుంటే చట్ట ప్రకారం పరువు నష్టం దావాను వేయడంతో పాటు క్రిమినల్ కేసు వేస్తామని కేటీఆర్ ఇటీవల స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు, ప్రముఖ నటుడు నాగార్జున కూడా కొండా సురేఖపై క్రిమినల్ పరువు నష్టం దావా వేశారు. దీంతో కోర్టు ఆమెకు నోటీసులు జారీ చేసింది. తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్టను దెబ్బతీసేలా నిరాధార వ్యాఖ్యలు చేశారని, చట్టప్రకారం కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని నాగార్జున తన పిటిషన్‌లో కోరారు.

## ప్రధాని మోడీ వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా ఫైర్

అమరావతి: కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలపై ఏపీ పీసీపీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ ను విద్వేషాల ఫ్యాక్టరీ అని మోడీ అనడం దొంగే దొంగ దొంగ అని అరిచినట్లుందన్నారు. విజయవాడలో ఆమె మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పై మోడీ విమర్శల తీరు పచ్చ కామెర్ల రోగికి లోకమంతా పచ్చగా కనిపించిన తీరుగా ఉందని విమర్శించారు. ఈ దేశంలో విద్వేషాలను రెచ్చగొట్టి కుల,మతాల మధ్య చిచ్చు పెట్టి విభజన రాజకీయాలు చేసేది బీజేపీనే అని దుయ్యబట్టారు. కుట్ర రాజకీయాలకు కేరాఫ్ బీజేపీ అని, మత రాజకీయాలకు జన్మస్థలం ఆ పార్టీయేనన్నారు. మతాన్ని కవచంలా అడ్డుపెట్టుకుని దర్జాగా దేశాన్ని దోచుకుంటుందని, దోస్తులకు దేశ సంపదను దోచిపెడుతుందన్నారు. చావు తప్పి కన్ను లొట్టపోయినట్లుంది హర్యానాలో బీజేపీ విజయమని, ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడినా.. ప్రజల మనసులో బలంగా నాటిన ప్రేమ, ఐక్యత సందేశం క్రమంగా ఉద్యమంగా, ఉప్పెనగా మారుతోందని బీజేపీకి తెలుసుకోవాలన్నారు. కాంగ్రెస్ మనుషుల్ని, వారి మనసులను గెలిచిందని గ్రహించాలని, నఫ్రత్, మొహబ్బత్ కు మధ్య జరిగిన యుద్ధంలో ప్రేమనే గెలిచిందన్నారు. జమ్మూకాశ్మీర్ లో తెరుచుకున్న "మొహబ్బత్ కి దుకాణ్" లు రేపు దేశం మొత్తం తెరుచుకుంటాయని జోస్యం చెప్పారు. మోడీ హఠావో..దేశ్ బచావో నిజమవుతుందని, 10 ఏళ్లుగా దేశం వెలుగుతుందని ప్రధాని మోడీ పచ్చి అబద్ధాలు చెప్తున్నారని, విశ్వగురువు కాదు.. విష పురుగు" అని ప్రజలకు అర్థం అవుతుందన్నారు. విద్వేషాన్ని పెంచేది మోడీ..ప్రేమను పంచేది రాహుల్ అని స్పష్టం అవుతుందని పేర్కొన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ శక్తులు రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై దాడులు చేస్తుంటే, ఎదిరించిన గొంతుకలను, నక్సల్స్, టెర్రరిస్టులు, హిందూ వ్యతిరేకులుగా పోల్చుతుంటే, హక్కుల పరిరక్షణకు, కాంగ్రెస్ మాత్రమే ప్రత్యామ్నాయం అని దేశం నమ్ముతుందన్నారు. ఈ నమ్మకమే 2029లో దేశాన్ని కాంగ్రెస్ నిలబెడుతుందని, ప్రధానిగా రాహుల్ గాంధీని దేశం చూడబోతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అన్ని వర్గాల అభివృద్ధి, ప్రజా సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, కాంగ్రెస్ అందించేది ఆపన్న హస్తం, వాడిపోవటానికి అతి చేరువలో ఉన్నది కమలం పార్టీ అని వ్యాఖ్యానించారు.

# తలసీమియాతో బాధపడుతున్న చిన్నారికి రూ.10 లక్షల సాయం

## చిన్నారి తల్లిదండ్రులకు రూ.10 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందించిన ప్రత్తిపాటి



చిలకలూరిపేట, (శుభోదయం న్యూస్): తలసీమియాతో బాధపడుతున్న చిన్నారి వైద్య ఖర్చుల కోసం ప్రభుత్వం తరపున రూ. 10లక్షల సాయం అందించారు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు. సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన ఆ మొత్తం చెక్కును గురువారం బాధిత కుటుంబానికి ఇచ్చారు. చిలకలూరిపేట పట్టణానికే చెందిన దూపాటి రవిబాబు, రోజారాణి దంపతుల కుమార్తె విజయకుమారి కొంతకాలంగా తలసీమియా తో బాధపడుతుంది. ఆ విషయం స్థానిక నాయకులు ప్రత్తిపాటి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయించారు. దానికి సంబంధించిన చెక్కును చిన్నారి కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ముఖ్యమంత్రి సహాయనిధి పాత్ర చెప్పలేనిదన్నారు. కష్టంలో ఉన్నారు అని ఎవరైనా ఆర్జీ పెట్టుకుంటే చాలు మానవత్వంతో స్పందించి సహాయం చేస్తున్న సీఎం చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మహా గౌరీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన మానసా దేవి



ప్రకాశం జిల్లా బ్యూరో, (శుభోదయం న్యూస్): పరాశక్తి అవతారమైన శ్రీ మానసా దేవి అమ్మవారిని మొక్కుకుంటే కోరిన కోర్కెలు తీరతాయని సంతానం లేని భక్తులు అమ్మవారి వద్ద మొరపడితే వారికి సంతానం కల్పించే కల్పవల్లిగా అక్కడ భక్తుల నమ్మకం అమ్మవారిని పూజిస్తే అన్ని ఆటంకాలు పోతాయని భక్తుల విశ్వాసం. నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండల పరిధిలోని తూర్పు రొంపిదొడ్ల గ్రామంలో చల్లా వంశస్థుల ఆధ్వర్యంలో నిర్మించినటువంటి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఎనిమిదవ రోజు గురువారం మానసా దేవి అమ్మవారిని మహా గౌరీ అలంకారంలో అమ్మవారిని భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి కుంకుమార్చన, సహస్ర దీపాలంకరణ, మహా నైవేద్యం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలను భక్తులకు పంచిపెట్టారు. ఆలయాన్ని పలు రకాల పుష్పాలతో విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. అదేవిధంగా వరికుంటపాడు లోని శ్రీ సాయినాధుని ఆలయంలో కాళికాదేవిని మహిషాసుర మర్దిని అవతారంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరికుంటపాడు లోని శ్రీనాగార్పమ్మ ఆలయంలో అమ్మవారిని మహిషాసుర మర్దిని అలంకారంలో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

# అమ్మవారి అనుగ్రహంతోనే శాసన సభ్యునిగా ఎన్నికయ్యాను

## పశ్చిమ నియోజకవర్గ

## ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ (సుజన చౌదరి)



విజయవాడ (శుభోదయం. న్యూస్ )వెస్ట్ రిపోర్టర్ : ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ (సుజన చౌదరి) వారి సతీమణి దుర్గాదేవి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కుటుంబ సమేతంగా గురువారం అమ్మవారిని దర్శించుకున్న శాసనసభ్యులు సుజనా దంపతులకు ఆలయ ఈవో కె ఎస్ రామారావు, స్వాగతం దర్శనానంతరం వేద పండితులు అమ్మవారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను, వారికి ఈ సందర్భంగా సుజనా చౌదరి మాట్లాడుతూ గత దశాబ్ద కాలంలో ఇంద్రకీలాద్రి పర్వతంపై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో ప్రతి ఏడాది జరిగే శరన్నవరాత్రి మహోత్సవాలలో ఈ ఏడాది ఉత్సవాలు ప్రత్యేకమైనవన్నారు.దసరా ఉత్సవాలలో అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తుల అభిప్రాయం ప్రకారం 95 శాతం మంది భక్తులు రాష్ట్ర దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఏర్పాట్లు అద్భుతమని ప్రశంసించడం రాష్ట్ర ప్రభుత్వానికి దక్కిన అతిపెద్ద ప్రశంసగా భావించారు. కనకదుర్గమ్మ వారు నివసిస్తున్న ప్రాంతానికి శాసన సభ్యునిగా ఎన్నిక కావడం దుర్గామాత అనుగ్రహమేనన్నారు. ప్రతి ఒక్కరికి సులభతర దర్శనం అందించేందుకు శాఖల మధ్య సమన్వయం కూడా బాగా కలిసొచ్చిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన, ఇంద్రకీలాద్రి దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.ఎస్. రామారావు, నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు అందరి సమన్వయంతోనే భక్తులు ఎంతో సంతోషంగా దర్శనం చేసుకుంటున్నారన్నారు. రానున్న రోజుల్లో దేవస్థానంపై జరిగే అన్ని ఉత్సవాలలో, మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఏడాది చేసిన ప్రయోగాలన్నీ విజయవంతం అయ్యాయన్నారు. ముఖ్యంగా వీఐపీ దర్శనాల కోసం ప్రత్యేక సమయం కేటాయింపు, దివ్యాంగులను దర్శనానికి తీసుకెళ్లేందుకు ప్రయోగాత్మకంగా వినియోగించిన యంత్రాలు... పనితీరు మెరుగుపరిచేందుకు వచ్చే ఏడాది ఉత్సవాల నాటికి చక్కదిద్దుతామన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన ఆయనకు దేవాలయ సిబ్బంది సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు, అమ్మవారి చిత్రపటం బహుకరించారు.

### పాత శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన సుజనా చౌదరి



విజయవాడ (శుభోదయం న్యూస్ )పశ్చిమ రిపోర్టర్ : భ్రమరాంబ మల్లేశ్వరాలయం పాత శివాలయం లో దేవీ నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండుగగా జరుగుతున్నాయి. దుర్గాదేవి అవతారంలో ఉన్న అమ్మవారిని పశ్చిమ శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ సుజన చౌదరి ఎపి ఆర్టీసి చైర్మన్ కొనకళ్ళ నారాయణతో కలిసి గురువారం దర్శించుకున్నారు.ఆలయ అధ్యక్షులు బొమ్మూ మధు, ఇఓ నటరాజన్ షణ్ముఖ, ప్రధాన అర్చకులు రాచకొండ సుమంత శర్మ, వారికి ఘన స్వాగతం పలికారు. దుర్గాదేవి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారికి ఎమ్మెల్యే సుజనా చౌదరి సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారికి పట్టు వస్త్రాలను అందజేసి చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా బిజెపి అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, పాలకమండలి సభ్యులు నాగోతి గురు, శాంతి, చందు, నాగోతి విజయనిర్మల, శేషుబాబు కూటమినేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించు సభ్యులకు అభినందనలు



విజయవాడ (శుభోదయం న్యూస్ )వెస్ట్ రిపోర్టర్ : రథం సెంటర్లోని అప్పన వెంకట కృష్ణయ్య కామేశ్వరమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా సంస్థను పశ్చిమ శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ సుజన చౌదరి గురువారం సందర్శించారు. ట్రస్ట్ సభ్యులు ఆహ్వానం మేరకు దసరా ఉత్సవాల్లో భాగంగా జరుగుతున్న మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ



నారాయణ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజనా మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవగా భావించి శతాబ్ది కాలంగా అప్పన వెంకట కృష్ణయ్య కామేశ్వరమ్మ చారిటబుల్ ట్రస్టు వారు చేస్తున్న సేవలను కొనియాడారు. సమాజ సేవలో భాగస్వాములైన లయన్స్ క్లబ్ సభ్యులను అభినందించారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా సుజనా భోజనం వడ్డించారు. కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు అప్పన సాయిబాబు, లయన్స్ క్లబ్ సభ్యులు ఆలమూరు అమర్నాథ్, తొండెపు హనుమంతరావు, మూల్పూరి ఉపేంద్ర, ఎన్టీఆర్ జిల్లా బిజెపి అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ లయన్స్ క్లబ్, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

### శ్రీ పోలేరమ్మ తల్లి దేవాలయం వద్ద అన్నదాన కార్యక్రమం!

### ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు








టంగుటూరు, (శుభోదయం న్యూస్): టంగుటూరులో వేంచేసియున్న శ్రీ పోలేరమ్మ తల్లి దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దేవాలయ ఆవరణంలో గురువారం ప్రత్యేక పూజలు మరియు భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రముఖ పారిశ్రామిక వేత్త మాజీ శాసనసభ్యులు పోతుల రామారావు ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ముందుగా ఆయన శ్రీ పోలేరమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ పోలేరమ్మ తల్లి కరుణా కటాక్షాలు ఎల్లవేళలా ప్రజలందరిపై ఉండాలని అందరూ సుఖ సంతోషాలతో జీవించాలన్నారు. తదనంతరం భారీ అన్నదాన కార్యక్రమాన్ని తన స్వహస్రాలతో ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ పెద్దలు పోతుల నరసింహారావు చిడిపోతు వెంకటేశ్వర్లు కోటయ్య తులసీరావు సుబ్బారావు తదితర ఆలయ నిర్వాహ కమిటీ ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించడం జరిగింది.

# పెన్నా నదిలో గల్లంతైన యువకుడు మృతి



సిద్ధవటం, అక్టోబర్, 10( శుభోదయం న్యూస్): మండల కేంద్రమైన సిద్ధవటం లో లెవెల్ వంతెన దగ్గర బుధవారం కడప బీడీ కాలనీ చెందిన వ్యక్తి జేమ్స్(28) పెన్నా నదిలో గల్లంతయ్యాడు విషయం తెలుసుకున్న పోలీసులు అదేరోజు విస్తృత గాలింపు చర్యలు చేపట్టిన ఆచూకీ లభ్యం కాలేదు గురువారం ఉదయం ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణంరాజు నాయక్ పరవేక్షణలో పెన్నా నదిలో గజ ఈతగాల్ల సహాయంతో లో లెవెల్ వంతెన వద్ద నీటిలో దిగి పరిసర ప్రాంతాల నందు గాలింపు చర్యలు చేపట్టగా సమీపంలో ఉన్న కంప చెట్టు దగ్గర జేమ్స్ మృతదేహం లభ్యం కావడంతో పెన్నా నది నుండి వెలికి తీశారు స్థానిక పోలీస్ సిబ్బంది బంధువులు యొక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవ పంచనామా నిమిత్తం కడప రిమ్స్ తరలించారు ఈ సందర్భంగా ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణంరాజు నాయక్ మాట్లాడుతూ లో కాజ్వే వద్ద రహదారికి ఇరువైపులా పెన్నా నది పరిసర ప్రాంతాలకు వెళ్లకుండా రోడ్డు పూర్తిగా బ్లాక్ చేశామని అవగాహన లేకుండా పెన్నా నదిలోకి ఎవరు దిగకూడదని ఆయన అన్నారు కొత్త వ్యక్తులు ఎవరైనా కూడా ఆ ప్రాంతాలలో ఉంటే వెంటనే సమాచారం ఇవ్వాలని మండల ప్రజలకు తెలియజేశారు.

# బీసీ వసతి గృహాలు తనిఖీ



సిద్ధవటం, అక్టోబర్,10(శుభోదయం న్యూస్): మండల కేంద్రమైన సిద్ధవటం లోని బీసీ బాలుర, బాలికల వసతి గృహాలను గురువారం సిద్ధవటం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇంచార్జ్ గాయత్రి అకస్మికతనికి చేశారు బీసీ బాలుర విద్యార్థుల గదులను స్టోర్ గదిని, డైనింగ్ హాల్ వంట రూము, టాయిలెట్ గదులుఆఫీసులోని పలు రికార్డులుపరిశీలించారు, ఈ సందర్భంగా సిద్ధవటం జూనియర్ సివిల్ జడ్జి ఇంచార్జ్ గాయత్రి మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వులు మేరకు తాను సిద్ధవటం లోని బాలుర, బాలికల వసతి గృహాలను తనిఖీ చేశానని విద్యార్థుల గదుల్లో ఫ్యాన్సు కొరతగా ఉన్నాయని కిటికీలకు రెక్కలు పూర్తిగా దెబ్బతిన్నాయని టాయిలెట్, బాత్రూం గదుల తలుపులు సరిగా లేవని వసతి గృహం అధికారి ప్రసాద్ ను ప్రశ్నించారు బడ్జెట్ మంజూరైన వెంటనే అన్ని వసతులు చేయిస్తానని హాస్టల్ వార్డెన్ ప్రసాద్ తెలియజేశారు బాలుర



వసతుగృహం పరిశుభ్రంగా ఉంచడం, పలు రికార్డులు సక్రమంగా ఉండడం వల్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# పాలించు పరమేశ్వరి.. మమ్మేలు జగదీశ్వరి



రెంటచింతల(శుభోదయం న్యూస్): మండల వ్యాప్తంగా దసరా నవరాత్రులు భక్తిప్రపత్తులతో జరుగుతున్నాయి.శరన్నవరాత్రుల్లో అష్టమినాడు అన్ని ఆలయాలు, మండపాలలో అమ్మవారు దుర్గతులను నివారించే ఆదిపరాశక్తి దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారి అవతారాలన్నింటిలో దుర్గా స్వరూపమే ప్రధానమైనది. కోటి సూర్య ప్రభలతో వెలుగొందే ఈ దేవి భక్తులను సర్వదుర్గతుల నుంచి కాపాడుతుంది. ఆ తల్లి ఉపాసన ద్వారా ఈతి బాధలు నశించి, గ్రహ బాధలు తొలగుతాయన్నది భక్తుల ప్రగాఢ విశ్వాసం. స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయం, రామాలయం, చౌడేశ్వరి ఆలయం, ఉట్ల స్తంభాలు మండపం,పాల్వాయి జంక్షన్లోని ఆలయం, సత్రశాల ఆలయాల్లో అమ్మవారు దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దివ్య తేజోరూపంతో విరాజిల్లుతున్న అమ్మవారిని పూజించుకున్న భక్తులు ఓం దుం దుర్గాయై నమః మంత్రాన్ని జపిస్తూ ఆధ్యాత్మిక పరవశం చెందారు. దుర్గా సూక్తం, లలిత అష్టోత్తరం, దుర్గా స్తోత్ర పారాయణాలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.పుష్పతోరణాలతో అమ్మవారిని పూజించి పులగం నివేదించారు.

# ఐసీఐసీఐ బ్యాంకులో సీఐడీ విచారణ




చిలకలూరిపేట, (శుభోదయం న్యూస్), అక్టోబర్ 10 : పట్టణములోని ఐసీఐసీఐ బ్యాంకులో గురువారం సీఐడీ అధికారులు విచారణ చేపట్టారు. ఇటీవల బ్యాంకులో రూ.కోట్ల ఫిక్స్డ్ డిపాజిట్ల నగదు గల్లంతు అక్రమాలను నిగ్గు తేల్చేందుకు సీఐడీ అధికారులు బ్యాంకులో సోదాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో బ్యాంకులోని సిబ్బంది, ఖాతాదారులను అధికారులు విచారించారు. కాగా డిపాజిట్ సొమ్ముతో మేనేజర్ నరేశ్, అప్రైజర్ హరీశ్ పరారైన విషయం తెలిసిందే.ఈమేరకు వారు లోతైన విచారణ చేపట్టే యందు సిద్ధం అవుతున్నారు.

# దసరా నుంచి పల్లెలు, గ్రామీణ ప్రాంత రోడ్లకు పండగే: ప్రత్తిపాటి



యడ్లపాడు, (శుభోదయం న్యూస్), అక్టోబర్ 10: రాష్ట్రంలో పల్లెలు, గ్రామీణ రోడ్లకు ఈ దసరా నుంచి మొత్తం పండగ వాతవరణే అన్నారు ప్రత్తిపాటి పుల్లారావు. పట్టణాలు, గ్రామాల్ని కలిపి రోడ్ల నుంచి గ్రామాల్లో అంతర్గత మార్గాల వరకు అన్నింటికీ కూటమిప్రభుత్వం కొత్తరూపు ఇవ్వబోతున్నట్లు తెలిపారు. యడ్లపాడు మండలం బోయపాలెం-సంగంగోపాలపురం ఆర్అండ్బీ రోడ్డు నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాల వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి శంకుస్థాపన చేశారు. రూ.45 లక్షల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ఈ సీసీ రహదారిని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన అన్ని వసతులు, చుట్టూ కొండల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణం, విశాలమైన భవనాలతో ప్రతిష్ఠాత్మకమైన గురుకుల పాఠశాల ఇక్కడ ఉండడం పేదవిద్యార్థులకు వరమన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే ఇలాంటి వసతులున్న గురుకులం మరెక్కడా లేదన్నారు. త్వరలోనే ఈ పాఠశాల స్థాయి ప్లస్ టూకి పెరగనుందన్నారు. ఇక్కడ వెయ్యిమంది పిల్లలు చదువుకునేందుకు, వసతి ఉన్నాయని, పాఠశాలకు వెళ్లేందుకు రహదారి నిర్మాణం చేయాలని విద్యార్థులు కోరిన పిమ్మట సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం



పవన్కల్యాణ్ సహకారంతో రూ.45 లక్షలతో సీసీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. మొదటి విడతగా సీసీ రహదారి నిర్మాణం చేపట్టామని, రెండో విడతలో మిగిలిన దాన్నీ పూర్తి చేస్తామన్నారు. బోయపాలెం-చెంఘీజ్ఖాన్ పేట రహదారిని జాతీయ రహదారిలో పెడుతున్నామని, అది కూడా రెండు వరుసల రహదారి వేసేలా వీలైనంత త్వరగా మంజూరు చేస్తామన్నారు. జాతీయ రహదారి నుంచి గురుకుల పాఠశాలకు కాలికి మట్టి కాకుండా వచ్చే విధంగా సీసీ రహదారి నిర్మాణం చేస్తున్నామన్నారు. రహదారి, పాఠశాల భవనాలు, సౌకర్యాలు, ప్రిన్సిపల్, సిబ్బంది అన్నీ బావుండి పిల్లలను బాగా చూస్తే నమ్మకం పెరిగి మరింతమంది వస్తారన్నారు. ఇటీవల ఇక్కడ కొంతమంది పిల్లలు బయట కు పోవడం, సిబ్బందిపై చర్యలకు సిఫార్సులు చేశారని, ఉన్న సిబ్బందిలోనూ కొంత మార్పు రావాలన్నారు. పాఠశాలలో విద్యార్థులు సరిపడినంత మంది ఉంటేనే ప్రిన్సిపల్తో పాటు సిబ్బందికి జీతాలు వస్తాయని, వారు లేకపోతే జీతాలు వచ్చే పరిస్థితి కూడా ఉండదన్నారు. నెల లోపే సీసీ రహదారి నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ఇక్కడే ఉన్న 2 ఎకరాల్లో నివాస స్థలాలు ఇస్తే ఇళ్లు కట్టుకుంటామని బోయపాలెం ప్రజలు కోరారని, వీలైనంత త్వరగా ఇంటి స్థలాలు ఇచ్చి ప్రభుత్వం తరపునే ఇళ్లు మంజూరు చేయించి కట్టించి ఇస్తే ఇక్కడ ఉన్న పాఠశాలకు అండగా ఉండటంతో పాటు ఈ పాఠశాల ఇంకా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు.

## ప్రజా సమస్యలపై పల్లెబాట పట్టిన అధికారులు




సిద్ధవటం, అక్టోబర్10,(శుభోదయం న్యూస్): సిద్ధవటం మండలం జంగాలపల్లె గ్రామపంచాయతీలో గురువారం మండల అధికారులు పల్లె బాట పట్టారు గ్రామోదయం కార్యక్రమం పై ప్రజల వద్దకు వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా మండల స్పెషల్ ఆఫీసర్ జయసింహ మాట్లాడుతూ చెత్త





సంపద సృష్టించే కేంద్రం వద్ద హరిత రాయబారులతో కలసి సంపద సృష్టిస్తే కార్యక్రమం పై వివరించామని పచ్చదనాన్ని పెంచే విధంగా మొక్కలు నాటాలని అంగన్వాడి కేంద్రంలో గర్భవతులకు అందించే పౌష్టికాహారం పై గ్రామంలో ప్రజలను అడిగి వివరాలు సేకరించామని విద్యుత్ దీపాలు పల్లెల్లో ఎక్కడ సమస్య లేకుండా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని పల్లె ప్రాంతాల్లో రహదారులు సమస్యలు ఉన్నవారు తెలియజేయాలని ఎస్సీ ఎస్టీ కాలనీలో ఉన్న ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు పై వివరాలు సేకరించామని రాష్ట్ర ప్రభుత్వం అమలుపలిచిన సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమం కల్పించామని అర్హులుగా ఉండి సంక్షేమ పథకాలు అందని వారికి సమీప గ్రామ సచివాలయంలోకి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని వారికి తెలియజేసినట్లు ఆయన అన్నారు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు గ్రామాలు పరిశుభ్రంగా పెట్టుకునేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఎండు చెత్త పొడి చెత్త వేరువేరుగా చేసి గ్రీన్ అంబాసిడర్ వాహనంలో వేయాలని ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి ఫణి రాజకుమారి, మండల విస్తరణ అధికారి మెహతాజ్ యాస్మిన్, పంచాయతీరాజ్ ఏఈ నాగరాజు వర్క్ ఇన్స్పెక్టర్ అతి కారి వెంకటరమణ ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యంపై యుద్ధవిరులకు చిరు సత్కారం కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్నాధం




విశాఖ ఉమ్మడి జిల్లా బ్యూరో, (శుభోదయం న్యూస్): పరిశుభ్రతకి ప్రతిరూపం మీరు, పురుటి భూమి స్వచ్ఛతకి శ్రమతో శుభ్రం చేసే మీ సంకల్పం వర్ణించలేనిది అని రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్నాధం అన్నారు. గాజువాక నియోజకవర్గం 87వ వార్డు పరిధిలో వడ్లపూడి రామాలయం ప్రాంగణంలో పారిశుద్ధ కార్మికులకు సత్కారం కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్నాధం పాల్గొని కార్మికులకు సాలువ మరియు మెమొంటోతో సత్కరించి, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధాని విపత్తు సమయంలో విస్తృత సేవలు అందించిన కార్మికులందరికీ మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో బిజెపి కో కన్వీనర్ లక్కరాజు సోమరాజు, టిడిపి జిల్లా నాయకులు కర్రి కన్నారావు, సీనియర్ నాయకులు, ప్రగడ దానయ్య, బిజెపి వార్డు అధ్యక్షులు సురేష్, ద్రోణాద్రి అప్పలనాయుడు, ఆనంద్ కుమార్, కణితి



ఈశ్వరరావు ,కనక సత్యం,జాన్ రమేష్, జోసెఫ్, జి.కనకరాజు, కడుపుట్ల శ్రీను,ఏటీయన్ మూర్తి,దాలయ్య,ఆదినారాయణ,మాటూరి రాము,చక్రవర్తి,పరమానందయ్యా,పరమేశ్వరరావు, మింది పెరయ్య,కర్రి కృష్ణ, సుందరపు అప్పలరాజు,కర్రి సన్యాసిరావు,శానిటరీ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, మరియు పారిశుద్ధ కార్మికుల, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ విద్యార్థులకు వృత్తి విద్యలో ఇంటర్న్షిప్ ప్రోగ్రాం



లింగసముద్రం,(శుభోదయం న్యూస్) : ఏపీ మోడల్ స్కూల్ తిమ్మారెడ్డి పాలెం విద్యార్థులు వోకేషనల్ సబ్జెక్టుల నందు ఇంటర్నల్ షిప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఒకేషనల్ ట్రైనర్ ఎం పాండురంగారెడ్డి మరియు టి.కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం




సిద్ధవటం, అక్టోబర్10, (శుభోదయం న్యూస్): మండల కేంద్రమైన సిద్దవటం మండల అభివృద్ధి కార్యాలయం సభా భవనంలో గురువారం మండల ప్రత్యేక అధికారి జయసింహ అధ్యక్షతన సమాచార హక్కు చట్టం 2005 పై మండల స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అగ్రికల్చర్ వ్యవసాయ శాఖ సంచాలకులు నాగరాజు హాజరయ్యారు ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి జయసింహ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరికి పూర్తి అవగాహన కలిగి ఉండాలని సెక్షన్6,7(1) ప్రకారం దరఖాస్తు చేసుకున్న వ్యక్తులకు 30 రోజుల్లో అడిగిన సమాచారం పూర్తిస్థాయిలో ఇవ్వాల్సి ఉంటుందని సెక్షన్ 4(1)() ప్రకారం కార్యాలయం ఆవరణంలో సమాచార హక్కు బోర్డు ఏర్పాటు చేయాలని సమాచార అధికారి సహాయ సమాచార అధికారి ఆపిలేట్ అధికారి పేర్లు హోదా మరియు మొబైల్ నెంబరు బోర్డు నందు ఉండేటట్టు చూడాలని ప్రతి పౌరునికి సమాచార చట్టం అడిగే హక్కు ఉందని వారు అలిగిన సమాచారాన్ని నియమ నిబంధన ప్రకారం ప్రతి ఒక్కరు ఇవ్వాలని ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ రమేష్ రెడ్డి రైతు సేవ కేంద్రం వ్యవసాయ సహాయకులు ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దుర్గా పూజలో అందరు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయగలరు



మైలవరం, (శుభోదయం న్యూస్ )వెస్ట్ రిపోర్టర్ : శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు, శిరీష, ఈరోజు ఉదయం 8 గంటలకు విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని శాసనసభ్యుని వారి కార్యాలయంలో దసరా మహోత్సవాలను పురస్కరించుకుని దుర్గాదేవి అమ్మవారి పూజా కార్యక్రమంలో పాల్గొననున్నారు. అనంతర%శీ% గొల్లపూడిలోని ఎమ్మెల్యే కార్యాలయంలోనే ఉదయం 10 గంటలకు ఎన్డీఏ కూటమి బలపర్చిన ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ రాజా పరిచయ కార్యక్రమం, ఓటర్ల నమోదుపై అవగాహన కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ శ్రీ కేశినేని శివనాథ్ చిన్ని, జిల్లా టీడీపీ అధ్యక్షులు నెట్టెం రఘురాం, శాసనమండలి సభ్యులు పరుచూరి అశోక్ బాబుతో పాటు ఎమ్మెల్యే కృష్ణప్రసాదు పాల్గొననున్నారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జిలు, యూనిట్ ఇంచార్జిలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు, టీడీపీ, జనసేన, బీజేపీ ముఖ్యనేతలు అందరూ పాల్గొని జయప్రదం చేయప్రార్థన.

## సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండండి

### విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలు



ఏపీ స్టేట్ బ్యూరో, (శుభోదయం న్యూస్): విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర గురువారం ఉదయం దసరా నవరాత్రుల ఉత్సవాలకు ఏర్పాటులలో ఫీల్డ్ లో ఉన్న సిబ్బందితో టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండి రానున్న మూడు రోజుల్లో అమ్మవారి దర్శనానికి భక్తులు అధిక శాతం లో వచ్చే అవకాశాలు ఉంటాయి కాబట్టి సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు పారిశుధ్య నిర్వహణ చేసుకుంటూ క్యూలైన్లో త్రాగునీటి ఏర్పాటు లలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని అన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాటులో ఎటువంటి లోపం లేకుండా చూసుకుంటూ ఉండాలని అధికారులు సిబ్బందితో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, త్రాగునీటి పాయింట్లలో స్టాక్ ఎప్పటికప్పుడు ఉండేటట్టు చూసుకోవాలని, ప్రతి గంటకు నివేదికను సమర్పిస్తూ త్రాగునీటి సౌకర్యాలలో ఎటువంటి లోపం లేకుండా ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండేటట్టు చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. తాత్కాలిక మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ, పరిశుభ్రమైన వాతావరణ కల్పించేలా చూసుకోవాలని అందుకు అధికారులు నిరంతరంగా పర్యవేక్షణ చేసుకుంటూ ఉండాలని అధికారులను ఆదేశించారు. అధికారులు, సిబ్బంది వాళ్లకి కేటాయించిన ప్రదేశాలలో ఉంటూ విధులు నిర్వహించాలని ఆదేశించారు. తాత్కారిక మరుగుదొడ్లు లలో నీటి సరఫరా లో ఎటువంటి అంతరాయం లేకుండా చూసుకోవాలని మరుగుదొడ్లలో ఉండాల్సిన సౌకర్యాలలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణ ఎప్పటికప్పుడు చూసుకుంటూ క్యూలైన్లో భక్తులు వదిలేసిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు చెత్తబుట్టలో వేసుకుంటూ పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

## మానవత్వానికి మనిషి రూపం రతన్ టాటా

### రతన్ టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన జనసేన నేతలు



స్టేట్ బ్యూరో (శుభోదయం న్యూస్) : పారిశ్రామిక దిగ్గజం, పద్మవిభూషణ్, తన మేధో శక్తితో భారతదేశ రూపురేఖలు మార్చిన టాటా గ్రూప్ చైర్మన్ రతన్ టాటా మరణం దేశానికి తీరని లోటని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. దేశం ముందు ఆ తరువాతే ఏదైనా అంటూ నిస్వార్ధ దేశభక్తికి నిలువెత్తు నిదర్శనంగా టాటా నిలిచారంటూ కొనియాడారు. గురువారం రతన్ టాటా చిత్రపటానికి శ్రీనివాసరావుతోటలో పూలమాలలు వేసి ఘననివాళు లర్పించ్చారు. తన సంపాదనలో అధిక భాగం దేశానికి, పేదలకు ఖర్చు చేసిన మానవతామూర్తి రతన్ టాటా అన్నారు. గుండుసూది నుంచి విమానం వరకు ఉప్పు నుంచి ఉక్కు వరకు తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించి జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక యవనికపై తనదైన ముద్ర వేసుకున్నారన్నారు. రతన్ టాటా మరణంతో భరతమాత తన ముద్దుబిడ్డని కోల్పోయిందని ఆళ్ళ హరి అన్నారు. నివాళులర్పించిన వారిలో రెల్లి సంఘం నేత సోమి ఉదయ్ కుమార్, కోలా అంజి, ఫణి, నందూరి స్వామి,చింతకాయల సాయి, అలా కాసులు తదితరులున్నారు.

## దుర్గా మాత దగ్గర అన్నదానం....




దోమ, (శుభోదయం న్యూస్): దోమ మండల కేంద్రంలోని దుర్గా మాత దగ్గర గురువారం అన్న దాన కార్యక్రమం జరిగింది. నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్న దాన కార్యక్రమం లో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి పాల్గొని అన్నప్రసాదమును స్వీకరించారు. ఈ కార్యక్రమం లో దోమ మండల సర్పంచుల సంగం మాజీ అధ్యక్షులు కె.రాజిరెడ్డి మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య,మాజీ ఎంపీపీ రాజగోపాల చారి, మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం,దాసరి రాజేందర్,మరియు దాతలు నిర్వహణ కమిటీ యువకులు మహిళా మణులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత సబ్సిడీ గ్యాస్ పత్రాలను అందజేసిన మోత్కూర్ కాంగ్రెస్ నాయకులు....



దోమ, (శుభోదయం న్యూస్): పరిగి నియోజకవర్గం దోమ మండలంలోని మోత్కూర్ గ్రామంలో ప్రజాపాలనలో భాగంగా మహాలక్ష్మి పథకం ద్వారా 500 రూపాయలకు సబ్సిడీ ద్వారా గ్యాస్ సిలిండర్ పొందుతున్న గ్రామ ప్రజలకు గుర్తింపు 585/- పత్రాలను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మురళీధర్ రెడ్డి, రామకృష్ణ ధనేశ్వర్, గ్రామ గ్రామ కమిటీ అధ్యక్షులు కొత్త పేట ఆనంద్, మండల ప్రధాన కార్యదర్శి ఎండీ షబ్బీర్,మైనార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు ఎండీ సర్దార్, సెక్రెటరీ రవీందర్ రెడ్డి,మేడిశెట్టి మల్లేశం, పశువుల డాక్టర్ ఎర్ర సారంగి, కొత్త పేట రాఘవేందర్, శ్రీనివాస్,ఎండీ కైసార్,సత్యయ్య, శంకర్( ఎన్టీఆర్,)తదితరులు గ్రామస్తులు మహిళలు పాల్గొన్నారు.

## దుర్గా మాతా పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి




దోమ, (శుభోదయం న్యూస్): దోమ మండల కేంద్రంలోని దుర్గా మాతకు మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ప్రత్యేక పూజ చేసారు.నిర్వాహకుల ఆహ్వానం మేరకు అయన దోమ మాజీ సర్పంచ్ కె.రాజిరెడ్డి,మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య,రాజగోపాల్ చారి, బుచ్చి రెడ్డి,వైస్ ఎంపీపీ మల్లేశం లతో కలిసి పూజలో పాల్గొన్నారు.విగ్రహాదాత రాజేందర్ ఎమ్మెల్యే ను శాలువా తో సన్మానించారు.అర్చకులు రవి పంతులు తీర్థ ప్రసాదాలు ఇచ్చారు.

## ఘనంగా బతుకమ్మ సంబరాలు



చౌడపూర్, (శుభోదయం న్యూస్): చౌడాపూర్ మండల పరిధిలోని మందిపల్ గ్రామంలో ఎస్సి కాలనిలో గురువారం ఘనంగా బతుకమ్మ పండుగ సంబరాలు నిర్వహించుకోవడం జరిగింది.తెలంగాణ సాంస్కృతి,సాంప్రదాయాలకు ప్రతీక,తెలంగాణ ఆడపడుచులకు అత్యంత ప్రీతి పాత్రమైన,బతుకమ్మ పండుగను చివరి రోజు మహిళాలు ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది.ఈ సందర్భంగా మహిళలు తీరు తీరు పువ్వులతో బతుకమ్మలను ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది.అనంతరం బతుకమ్మలను గ్రామ చెరువులో నిమర్జనం చెయ్యడం జరిగింది.ఈ కార్యక్రమంలో దేవమ్మ ,సత్యమ్మ,లింగమ్మ,శివానిలా,సంతోష,రాజేశ్వరి,సిరి,జ్యోతి,అనూష,చిట్టి గ్రామస్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## డెమొక్రటిక్ జర్నలిస్టు ఫెడరేషన్ పెద్దపల్లి జిల్లా జాయింట్ సెక్రెటరీగా మహంకాళి సంపత్ నియామకం



రామగుండం, అక్టోబర్10, (శుభోదయం న్యూస్) : డెమొక్రటిక్ జర్నలిస్టు ఫెడరేషన్ పెద్దపల్లి జిల్లా జాయింట్ సెక్రెటరీగా నియమించడం జరిగినది. డీజే ఎఫ్ జాతీయ అధ్యక్షులు మానసాని కృష్ణారెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు మోట పలుకుల వెంకట్, జిల్లా అధ్యక్షులు కల్లపెల్లి కుమార్ ఆదేశాల మేరకు పెద్దపెల్లి జిల్లా డీజే ఎఫ్ జాయింట్ సెక్రెటరీగా మహంకాళి సంపత్ ను నియమించడం జరిగినది. అనంతరం డీజే ఎఫ్ నాలుగవ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా కేక్ కట్ చేసి కార్యక్రమం నిర్వహించినారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు సెక్రటరీ ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ మామిడిపల్లి శ్రీనివాస్,సమన్వయ కమిటీ సభ్యులు కన్నం అవినాష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గోదావరిఖనిలో అంగరంగ వైభవంగా దసరా ఏర్పాట్లు
### రామగుండం ఎమ్మెల్యే శ్రీ రాజ్ ఠాకూర్



గోదావరిఖని టౌన్, అక్టోబర్10, (శుభోదయం న్యూస్) : ఈనెల 12న జరిగే విజయదశమి పర్వదినం సందర్భంగా అంగరంగ వైభవంగా ఏర్పాట్లు చేయాలని రామగుండం శాసనసభ్యులు శ్రీ రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ అన్నారు. ఈ మేరకు రామగుండం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన రివ్యూ మీటింగ్ లో వివిధ శాఖల అధికారులు, స్థానిక పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన



మాట్లాడుతూ గోదావరిఖని పట్టణంలోని సింగరేణి స్టేడియంలో ఈనెల 12న సాయంత్రం జరిగే విజయదశమికి కని విని ఎరుగని రీతిలో సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి సింగరేణి సంస్థతోపాటు రామగుండం కార్పొరేషన్ ఆధ్వర్యంలో దసరా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ క్రమంలో అన్ని పరిశ్రమల ప్రతినిధులు సహకరించాలన్నారు. స్టేడియంలో భారీ రావణాసుర దహనం, టపాసుల మోతతో దసరా సంబరాలు చేస్తామన్నారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఏర్పాట్లకు సంబంధించి వివిధ శాఖల అధికారుల నుంచి సూచనలు, సలహాలు తీసుకున్నారు. కార్మిక కుటుంబాలకు తోపాటు అన్ని వర్గాల ప్రజలు ఉత్సవాలలో పాల్గొనాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి, ఎన్టీపీసీ, వివిధ పరిశ్రమల ప్రతినిధులతో పాటు అన్ని శాఖల అధికారులు, పోలీస్, ఫైర్, ట్రాఫిక్ తదితర విభాగాల అధికారులు హాజరయ్యారు. నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్, సింగరేణి సంస్థ జిఎం లలిత్ కుమార్, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 38వ డివిజన్ సంజయ్ గాంధీనగర్ లో దుర్గాదేవి ఊరేగింపు



గోదావరిఖని టౌన్, అక్టోబర్10, (శుభోదయం న్యూస్) : గోదావరిఖని పట్టణంలో 38వ డివిజన్ సంజయ్ గాంధీ నగర్ లో దుర్గామాత భక్తిశ్రద్ధలతో నవరాత్రులలో భాగంగా ఊరేగింపు కార్యక్రమం నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో38వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ బీసీ మహిళ అధ్యక్షురాలు పోరండ్ల శారద పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, మరియు డివిజన్ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పండుగ పూట 8 ఇంక్లైన్ కాలనీలో హత్య



రామగుండం, అక్టోబర్10, (శుభోదయం న్యూస్) : రామగుండం కమిషనరేట్ పరిధిలోని 8 ఇంక్లైన్ కాలనీ సంతోష్ నగర్ లో సాయంత్రం సాయి వినయ్ ఇంట్లో హత్యకు గురైనాడు వివరాలు మృతుడు సాయి వినయ్ (25) అంజలి అనే అమ్మాయి తో ప్రేమ వివాహం చేసుకొని సహజీవనం చేస్తున్నాడు కానీ అంజలికి ఇంతకుముందే వివాహం జరిగిందని ఇద్దరు పిల్లలు ఉన్నట్లు సమాచారం వివాహం ఇష్టం లేక సాయి వినయ్ తో జీవనం సాగిస్తుంది ఇతనితో ఉండడం అంజలి తమ్ముడు మరియు మొదటి భర్త తో కలిసి సాయి వినయ్ ని హత్య చేసినట్లు అనుకుంటున్నారు నిందితులు పరారీలో ఉన్నట్లు ఏసిపి రమేష్ టూ టౌన్ సిఐ ప్రసాద్ రావు ఎస్సై సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. త్వరలోనే నిందితుని పట్టుకుంటామని ఎ సిపి రమేష్ చెప్పారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# అట్టహాసంగా పూల పండుగ





పాపన్నపేట, (శుభోదయం న్యూస్): ప్రకృతిని పూజించే గొప్ప పండుగ,తెలంగాణ బతుకమ్మ పండుగ గురువారం కన్నుల పండువగా సాగింది.పాపన్నపేట మండల వ్యాప్తంగా..కుర్తివాడ గ్రామంలో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి.వివిధ రకాల పూలతో అందంగా బతుకమ్మలను తీర్చిదిద్దారు.ఆట పాటలతో మహిళలు సందడి చేశారు.ఈసందర్బంగా భాగ్యనగరం నుండి గ్రామానికి ప్రజలు పెద్ద సంఖ్యలో గ్రామాలకు చేరుకున్నారు.

## అటహాసంగా ప్రారంభమైన సద్దుల బతుకమ్మ వేడుకలు





రామగుండం: అక్టోబర్10, (శుభోదయం న్యూస్) గోదావరిఖని/ 8వ కాలనీ/ 16 డివిజన్ గణేష్ నగర్ లో సద్దుల బతుకమ్మ వేడుకలను హ్యూమన్ రైట్స్ జిల్లా చైర్మన్ ఆవుల రాజేష్ యాదవ్ 16 డివిజన్ కార్పొరేటర్ మందల కిషన్ రెడ్డి అట్టహాసంగా ప్రారంభించారు. వక్తలు మాట్లాడుతూ.. తెలంగాణ లో పూలతో పూజించే బతకమ్మ పండుగను ఒక ప్రత్యేకత ఉంది 9 రోజులు తీరకపోవులతోటి బతుకమ్మను పేర్చి ఒక్కొక్క రోజు ఒక్కొక్క విశిష్టత జరుపుకోవడం తెలంగాణ లో ఆనవాయితీగా ఉంది అని తెలంగాణ సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని రామగుండం నియోజకవర్గ ప్రజలకు ఆడబిడ్డలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేస్తూ మరియు కార్మిక లోకనికి విద్యావంతులకు పోలీస్ అధికారులకు సింగరేణి యాజమాన్యం వివిధ రాజకీయ నాయకులకు కార్యకర్తలకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.



గోదావరిఖని/రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో అన్ని డివిజన్ల లో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు బతుకమ్మను పూజించి తెలంగాణలో బతుకమ్మ పండుగను తిరొక్క పూలతో అలంకరించి ఆటపాటలతో బతుకమ్మ వేడుకను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### దుర్గా నగర్ కాలనీ నివాసులతో కలిసి
## బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే




గోదావరిఖని టౌన్: అక్టోబర్10, (శుభోదయం న్యూస్) : గోదావరిఖని పట్టణంలోని సింగరేణి స్టేడియంలో ఈనెల 12 సాయంత్రం జరిగే విషయ దశమికి పని విని ఎరుగని రీతిలో సంబరాలు నిర్వహిస్తున్నాము. ఈ కార్యక్రమంలో అన్ని పరిశ్రమల ప్రతినిధులు సహకరిస్తున్నారు స్టేడియంలో భారీ రావణాసుర దహనం టపాసులతో మోతలతో దసరా సంబరాలు చేస్తున్నాము అలాగే సంస్కృతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నాము ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్.ఈ సందర్భంగా గౌరవ ఎమ్మెల్యే ఎం ఎస్ రాజ్



ఠాగూర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పాలన అందిస్తుందని,రామగుండం లో సింగరేణి, టి ఎస్ జెన్కో సంయుక్త భాగస్వామ్యం తో 800 మెగావాట్ల పవర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.మేడిపల్లి ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు లో 500 మెగావాట్ల హైడ్రాల్ ప్రాజెక్టు ఏర్పాటు కాబోతుందని,ప్రత్యేక నిధులతో రామగుండం ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి పూర్వ వైభవం తీసుకువస్తామని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు 6 గ్యారెంటీ లను ఒక్కక్కటిగా అమలు పరుస్తూ ప్రజలకు అండగా ఉంటున్నది కాంగ్రెస్ ప్రభుత్వం. ఇచ్చిన గ్యారెంటీ ప్రకారం గా మహిళ సోదరి మణులకు ఉచితంగా బస్ సౌకర్యం కల్పించడం జరిగింది. ప్రతి ఇంటికి ఉచితంగా 200 లోపు విద్యుత్ అందివ్వడం జరుగుతుంది. 500 లకే గ్యాస్ ఇవ్వడం జరుగుతుంది. 2 లక్షల వరకు రుణమాఫీ చేయడం జరిగింది. ఇలా ఇచ్చిన ప్రతి హామీని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇవ్వడానికి కాంగ్రెస్ ప్రభుత్వం , సిద్ధంగా ఉన్న విషయాన్ని మీరూ గమనించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ గారు అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్పొరేటర్లు మాజీ కార్పొరేటర్లు వివిధ విభాగ్య అధ్యక్షులు తోపాటు కాలనీ నివాసులు ఉన్నారు.

## బాజీపేట అమ్మవారి పూజా కార్యక్రమంలో పాల్గొన్న యువ నాయకులు బోండా సిద్దార్థ



విజయవాడ (శుభోదయం న్యూస్ )సెంట్రల్ రిపోర్టర్ : దసరా నవరాత్రులలో భాగంగా గురువారం దుర్గాష్టమి సందర్భంగా ఇంద్రకీలాద్రిపై మరియు బావాజీ పేట నందు శ్రీ దుర్గ అమ్మవారిగా దర్శనమిచ్చిన అమ్మవారినీ తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బొండా సిద్ధార్ధ దర్శించుకుని ఆ అమ్మవారి చల్లని దీవెనలు ప్రజలందరిపై సెంట్రల్ నియోకవర్గం పై ఉండాలని కోరుకుంటూ నవరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. శరన్నవరాత్రుల్లో 8వ రోజు ఆశ్వయుజ శుద్ధ అష్టమిన విజయవాడ కనకదుర్గమ్మ శక్తి రూపమైన దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిస్తారు అని, లోక కంటకుడైన దుర్గమాసురుణ్ణి వధించి, ఇంద్రకీలాద్రిపై దుర్గగా, స్వయంభువై అమ్మవారు వెలసినది ఈ అష్టమి తిథి నాడేనని పురాణాలు చెబుతున్నాయి అని. అందుకే ఈ అష్టమిని దుర్గాష్టమి అని వ్యవహరిస్తారు దుర్గే దుర్గతినాశని,ఈ రోజున అమ్మవారి దర్శనంతో దుర్గతుల నుంచి విముక్తి కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం, కోటి సూర్యప్రభలతో వెలిగొందే ఆ దురమ్మ ,దేవి నవరాత్రుల సందర్భంగా ఆ దుర్గ మాత అనుగ్రహముతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్టు తెలియజేశారు.

## పాడి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



సింగరాయకొండ, (శుభోదయం న్యూస్) : ప్రభుత్వం అందించు పథకాలను ఉపయోగించుకొని పాడి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కె.బేబీ రాణి అన్నారు.మండలంలో బింగినపల్లి గ్రామంలో పశువులు మరియు గొర్రెల,మేకల కాపరులతో గురువారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ మాట్లాడుతూ పశువులకు ఎండ,వాన నుండి రక్షణకు పశువుల షెడ్లను 90% రాయితీపై అందిస్తున్నామన్నారు. సబ్సిడీ పై అందించిన జొన్న విత్తనాల గడ్డి మంచి పోషక విలువలు కలిగి ఉంటుందని తెలిపారు.సీజనల్ వ్యాధులు రాకుండా పశువులు జీవాలకు ముందస్తు టీకాలను వేయించాలని కోరారు.గొర్రెలు మేకలలో నులిపురుగులు నివారణ మందులను త్వరలో సరఫరా చేస్తామని తెలియజేశారు. పాడి రైతులకు,పశు కాపర్లకు సత్వర సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సింగరాయకొండ పశు వైద్యాధికారి డాక్టర్ యన్. హజరత్, వెటర్నరీ అసిస్టెంట్ రమణయ్య,పశువైద్య సహాయక సిబ్బంది మరియు పాడి రైతులు పాల్గొన్నారు.

### శ్రీ మహిషాసుర మర్ధిని అలంకరణలో
## భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ వాసవి మాత



ప్రకాశం జిల్లా బ్యూరో, (శుభోదయం న్యూస్):కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలో ఆర్యవైశ్యుల కులదేవత శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి తల్లీ ఆలయంలో మూడవ తేదీ గురువారం నుంచి దసరా




నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. నవరాత్రుల వేడుకల్లో ఎనిమిదో రోజు శ్రీ మహిషాసుర మర్దిని అలంకరణలో భక్తులకు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి తల్లి దర్శనమిచ్చారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అష్టమి ఉభయ దాతలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక



పూజలు నిర్వహించి తీర్థప్రసాదాల స్వీకరించారు.ఆలయ ప్రధాన అర్చకులు వేద పండితులు రాయప్రోలు తులసినాథ్,సుమంత్ లు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ గావించి పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ చైర్మన్ ఏల్చూరి బాల కొండలరావు ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు సకల సౌకర్యాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో రాచూరి శ్రీనివాసులు దంపతులు, రాచూరి కుటుంబ సభ్యులు, ఇమ్మడిశెట్టి కిషోర్ దంపతులు ,దర్శి మస్తాన్ రావు, రాచూరి సురేష్, మెంట నరసింహారావు, జి రామారావు, మంచి కంటి సుబ్బారావు, కారం శెట్టి నారాయణ, ముప్పసాని రాఘవ, ఈనాడు గోపాల్,సరాబు చంద్ర, సేగు కృష్ణయ్య, మునగనూరి సుబ్బారావు, రాచమడుగు వేణు, అష్టమి ఉభయ దాతలు, ఆర్యవైశ్య ప్రముఖులు, ఆర్యవైశ్య మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ కు రూ.3.50 లక్షల విరాళం
## సీఎం చంద్రబాబుకు అందజేసిన మంత్రి సవితమ్మ




శ్రీ సత్య సాయి జిల్లా (శుభోదయం న్యూస్): విజయవాడ వరద బాధితులకు ఆర్థిక సాయం నిమిత్తం పెనుకొండ నియోజక వర్గంలోని దాతలు అందజేసిన రూ.3.50 లక్షల చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు సీఎంఆర్ఎఫ్ కు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖా మంత్రి ఎస్.సవితమ్మ అందజేశారు. గురువారం మంత్రిమండలి సమావేశం అనంతరం సీఎం చంద్రబాబునాయుడుకు మంత్రి చెక్కులను అందజేశారు. పెనుకొండ పట్టణానికి చెందిన స్లం సమైక్య లు, దాతలు అందించిన మొత్తం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు అందజేశారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ విజయవాడ వరద బాధితులను ఆదుకోడానికి ముందుకొచ్చిన పెనుకొండ నియోజక వర్గానికి చెందిన దాతలను అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరికొందరు దాతలు బాధితులను ఆదుకోడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## భైరవకోనలో ప్రత్యేక పూజలు నిర్వహించిన సినీ నటులు శ్రీకాంత్



ప్రకాశం జిల్లా బ్యూరో, (శుభోదయం న్యూస్):దసరా నవరాత్రుల వేడుకల సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రం ప్రకాశం జిల్లా సి ఎస్ పురం మండలం భైరవకోనలోని త్రిముఖ దుర్గాంభా ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రముఖ సినీ నటులు శ్రీకాంత్ మరియు మిత్రులు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు శ్రీకాంత్ మిత్ర బృందానికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ముఖ్యంగా భైరవకోనలోని జలపాతాలను, అక్కడి సుందర దృశ్యాలను, ఎత్తయిన కొండలను చూసి శ్రీకాంత్ మిత్రబృందం ఆనందం వ్యక్తం చేశారు. సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ దసరా వేడుకల్లో అమ్మవారిని దర్శించుకోవడం పుణ్యప్రదం అన్నారు. మరొకసారి అవకాశం కుదిరినప్పుడు కుటుంబ సభ్యులతో వచ్చి భైరవకోనలోని సుందర ప్రదేశాలను వీక్షించి అమ్మవారికి పూజలు నిర్వహిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భైరవకోన ఆలయ కమిటీ సభ్యులు పలువురు భక్తులు పాల్గొన్నారు.



## ఘనంగా జాతీయ గ్రామీణ తపాలా దినోత్సవం



తనకల్లు, (శుభోదయం న్యూస్): తనకల్లు మండలంలో డి సి డి పి ప్రోగ్రాం జాతీయ గ్రామీణ తపాలా దినోత్సవం సందర్భంగా తనకల్లు మండలంలో పనిచేస్తున్న వివిధ గ్రామాల పోస్ట్మాస్టర్లు మరియు అసిస్టెంట్ పోస్ట్మాస్టర్లు కదిరి సబ్ డివిజనల్ ఇన్స్పెక్టర్ శ్రీ గోవర్ధన్ నాయక్ ఆధ్వర్యంలో మన తపాలా శాఖలో గ్రామీణ తపాలా జీవిత భీమా,చిన్న మొత్తాల పొదుపు , ఆడపిల్లల కోసం సుకన్య సమృద్ధి యోజన పథకం, పాలసీ 549 రూపాయల కే 1000000 బీమా పథకం, వివిధ పథకాల గురించి ర్యాలీ నిర్వహించడం జరిగినది ఈ ప్రోగ్రాంలో తనకల్లు సబ్ పోస్ట్ మాస్టర్ పీఎం జ్యోతిష్ కుమార్ ,అనిత ,నవీన్ కుమార్ మరియు మండలంలోని గ్రామీణ తపాలా ఉద్యోగులు అందరూ కలిసి ఈ కార్యక్రమమును విజయవంతం చేయడం జరిగినది.

శుభోదయం

సంపాదకీయం

# ఎందుకీ వంచన.?

## (విశ్లేషణ)

ప్రభుత్వాలు పటిష్టమైన సామాజిక రక్షణ పథకాలను అమలు జరపనట్లయితే వచ్చే దశాబ్ది కాలంలో ఆసియాలో **26**కోట్ల మంది దారిద్ర్యంలోకి దిగజారతారని మంగళవారం నాడు వెల్లడించిన ఐరాస నివేదిక హెచ్చరించింది. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో దారిద్ర్యం పెరుగుతోందని, అసమానతలు విస్తరిస్తున్నాయని కూడా ఆందోళన వ్యక్తం చేసింది. మొత్తంగా చూసినపుడు ఈ ప్రాంతంలోని **45**శాతం జనాలకు సామాజిక భద్రతా పథకాలు అమలు కావటం లేదు. అమలు జరుగుతున్న పథకాలు కూడా ఎంతమందికి మేలు చేస్తున్నాయన్నది ప్రశ్న. ఈ నివేదిక ఆసియా గురించి చెప్పింది గనుక మనదేశం మినహాయింపు కాదు. మన కేంద్ర ప్రభుత్వం జాతీయ సామాజిక సహాయ పథకం సోషల్ ఆడిట్ **2023** నివేదికను విడుదల చేసింది. **1995** నుంచి ఈ పథకం అమలు జరుగుతోంది. దీని ఐదు ఉపపథకాలు ఉన్నాయి. వాటిలో ఒకటైన వృద్ధాప్య పెన్షన్ కింద అరవై సంవత్సరాలు నిండితే నెలకు రూ.**200**, **80**ఏండ్లు దాటితే రూ.**500** ఇస్తున్నారు. ఈ మొత్తాలు ఏమూలకు సరిపోతాయో పాలకపార్టీ పెద్దలు చెప్పాలి. పొరుగు రాష్ట్రం ఏపీలో నెలకు నాలుగు వేలు గరిష్టంగా ఇస్తున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో వెయ్యి రూపాయలకు మించి ఇవ్వటం లేదు, ఇది కేంద్ర ప్రభుత్వ పథకమైనా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెంచకుండా పాతికేండ్ల నాటి మొత్తాలే ఇస్తున్నది. అంతర్జాతీయ సంస్థల దృష్టిలో ఇదొక ఉద్ధరణ పథకం.ఒకవైపు కోట్లాది మందిని దారిద్ర్యరేఖనుంచి ఎగువకు తెచ్చి ఉద్ధరించినట్లు మోడీ తన జబ్బలను తానే చరుచుకుంటారు. మరోవైపు సామాజిక సంక్షేమం కింద **80**కోట్ల మందికి ఉచితంగా బియ్యం, గోధుమలు ఇస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటారు. అంటే వారంతా దారిద్ర్యంలో ఉన్నట్లే కదా! ఎందుకీ వంచన? విషాదకరమైన అంశం ఏమిటంటే అసలు దారిద్ర్యరేఖకు ప్రాతిపదిక ఏమిటన్న దానిమీద ఇంతవరకు ఏకాభిప్రాయం లేదా ప్రమాణం లేదు. సాంకేతికంగా ఒక ప్రాతిపదికను గుర్తించినప్పటికీ అనేక దేశాల్లో దానికి ఎగువన అనేక కోట్లమంది ఎప్పుడైనా దారిద్ర్యంలో తిరిగి కూరుకుపోయే వారిగా వున్నారు. ఇది ఎలా అంటే గోచిపాత రాయుడు దుర్భర దారిద్ర్యంతో ఉన్నట్లు, చాలీచాలని అంగవస్త్రం చుట్టుకుంటే దాన్నుంచి బయటపడినట్లు పరిగణించటంగా చెప్పవచ్చు. అనుకోని అవాంతరాలు ఏర్పడితే అంగవస్త్రం కూడా కొనుక్కోలేరు. అనేక అంశాలను పరిగణనలోకి తీసుకున్న ప్రపంచ బ్యాంకు **2017**లో దుర్భర దారిద్ర్యరేఖ ప్రమాణంగా రోజుకు పిపిపి పద్ధతిలో ప్రతిమనిషికి **1.9**డాలర్లుగా ఉన్న దాన్ని **2.15** డాలర్లకు పెంచి అంతకంటే తక్కువ ఆదాయం వచ్చేవారిని గర్భదరిద్రులుగా వర్గీకరించింది. మన కరెన్సీలోకి దీన్ని మార్చుకుంటే రోజుకు ప్రతిమనిషికి రూ.**180** కంటే తక్కువ వచ్చేవారని అర్ధం. ఎవరికి వారు దీన్ని వర్తింపచేసుకుని తామెక్కడ ఉన్నదీ అర్ధం చేసుకోవచ్చు. ప్రపంచంలో అత్యధిక ధనవంతమైన దేశంగా పరిగణించే అమెరికాలో అంతకంటే తక్కువ రాబడి వచ్చేవారు **1.2**శాతం ఉన్నారు. ఈ కారణంగానే మన దేశంలో ఉచిత బియ్యం ఇస్తున్నట్లు అక్కడ పేదలకు ఆహార కూపన్లను ప్రభుత్వం ఇస్తున్నది. ఇండ్లు లేని వారు మనదేశంలో రోడ్ల మీద పడుకున్నట్లే అక్కడ పార్కుల్లో, ఇతర బహిరంగ ప్రదేశాల్లో ఉండేవారు కూడా ఉన్నారు. మనదేశాన్ని **2047** నాటికి ఎక్కడికో తీసుకుపోతామని చెబుతున్న నరేంద్రమోడీ, ఆయనకు భజన చేసే చంద్రబాబు, నితీష్కుమార్ వంటి వారు కొలువై ఉన్న మనదేశంలో గర్భదరిద్రులు **12.9**శాతం(**2022**) మంది ఉన్నారు. ఇది ప్రపంచ సగటు తొమ్మిదిశాతం కంటే ఎక్కువ. అదే **3.65** డాలర్లను తీసుకుంటే **44**శాతం, **6.85** డాలర్లను తీసుకుంటే **81.8**శాతం ఉన్నారు. ప్రపంచ సగటును చూస్తే ఈ తరగతికి కిందకు వచ్చే వారు **9-22.4-44.9** శాతం వంతున ఉన్నారు. కమ్యూనిస్టు నియంతల దేశం, అక్కడ ప్రజాస్వామ్యం ఉండదు అని చెప్పే చైనాలో ఈ అంకెలు వరుసగా **0-0.1-17**(**2020** సంవత్సరం ప్రపంచబ్యాంకు సమాచారం)శాతం మాత్రమే. ప్రపంచబ్యాంకు సమాచారం ప్రకారం..**2019**లో **2.15** డాలర్ల కంటే తక్కువ వచ్చే వారు **64.8**కోట్ల మంది ఉన్నారు.**25** . ఆసియన్ని డెవలప్మెంట్ బ్యాంక్ చెబుతున్నదాని ప్రకారం రోజుకు **1**డాలర్ల కంటే తక్కువ ఆదాయం వచ్చేవారు ఆసియా-పసిఫిక్లో **70**కోట్ల మంది ఉన్నారు. నిజానికి ఈ **1.25** డాలర్లన్నది **1988** నుంచి **2005**వరకు **15** అతిపేద దేశాలలో ధరలు, కరెన్సీల విలువను పరిగణనలోకి తీసుకొని నిర్ణయించారు. దీన్లో అసియా నుంచి రెండు దేశాలను మాత్రమే తీసుకున్నారు. నాటికి నేటికి వచ్చిన తేడాను పరిగణనలోకి తీసుకుంటే దారిద్ర్య నిర్మూలన, దారిద్ర్యరేఖ నిర్ణయం అంతా అంకెల గారడీ తప్ప మరొకటి కాదు.

# ఇరాన్‌పై ప్రతిదాడికి ఇజ్రాయెల్ రెడీ?



దిశ, నేషనల్ బ్యూరో: మధ్యాసియాలో పరిస్థితులు మరింత దిగజారేలా ఉన్నాయి. గాజాను బాంబుల వణికిస్తున్న ఇజ్రాయెల్ పై లెబనాన్ నుంచి హిజ్బుల్లా గ్రూపు దాడి చేయడం ప్రారంభించింది. ఇజ్రాయెల్ హిజ్బుల్లాపై తీవ్రంగా విరుచుకుపడింది. ఇరాన్ మద్దతున్న హిజ్బుల్లా టాప్ కమాండర్‌ను హతమార్చింది. దీంతో ఇరాన్ తొలిసారిగా ఇజ్రాయెల్‌తో కదనానికి కాలుదువ్వింది. ఈ నెల 1వ తేదీన ఇజ్రాయెల్ పై మూకుమ్మడిగా బాలిస్టిక్ మిస్సైళ్ల వర్షం కురిపించింది. ఈ దాడి యావత్ ప్రపంచాన్ని భయాందోళనలకు గురి చేసింది. ఇరాన్ పై ప్రతిదాడికి ఇజ్రాయెల్ రంగం సిద్ధం చేసుకుంటున్నది. ఇందుకు సంబంధించి బుధవారం అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో ఇజ్రాయెల్ అధ్యక్షుడు బెంజమిన్ నెతన్యాహు ఫోన్ మాట్లాడారు. సుమారు 50 నిమిషాలు మాట్లాడిన ఈ ఫోన్ కాల్‌లో ఉపాధ్యక్షురాలు కమలాహ్యారిస్ కూడా జాయిన్ అయ్యారు.

దాడి చేస్తే ఊరుకోం:

ఇది వరకే ఇరాన్ పై ప్రతిఘటనకు దిగితే.. అక్కడి న్యూక్లియర్ ఫెసిలిటీస్‌పై, ఆయిల్ రిజర్వ్‌లపై దాడి చేయవద్దని అమెరికా కండీషన్ పెట్టింది. కొన్ని వారాల తర్వాత బైడెన్‌తో నెతన్యాహు సమావేశం కావడం చర్చనీయాంశమైంది. ఇరాన్‌పై ప్రతిదాడికి సంబంధించే ఈ చర్చ జరిగినట్టు తెలుస్తున్నది. ప్రతిదాడికి షరతులతో కూడిన అంగీకారాన్ని అమెరికా ఇచ్చే చాన్స్ ఉన్నది. తమపై దాడికి దిగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఇది వరకే ఇరాన్ హెచ్చరించింది. దీంతో ఈ ప్రతిదాడి పూర్తిస్థాయి యుద్ధానికి దారితీస్తుందానే అనే ఆందోళనలు వెలువడుతున్నాయి.



గాజా హాస్పిటల్ పై దాడి:

మరోవైపు హిజ్బుల్లా, ఇజ్రాయెల్ మధ్య దాడులు జరుగుతూనే ఉన్నాయి. దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్ ప్రత్యక్ష యుద్ధం చేస్తున్నది. కాగా, హిజ్బుల్లాలు బుధవారం మధ్యాహ్నం 90 రాకెట్లు ఇజ్రాయెల్ పై ప్రయోగించినట్టు ఐడీఎఫ్ తెలిపింది. ఇందులో చాలా వరకు రాకెట్లను తాము అడ్డుకున్నా.. కొన్ని ఇజాయెల్‌లో పడ్డాయని వివరించింది. ఇలా పడిన రెండు రాకెట్లతో ఇద్దరు ఇజ్రాయెల్ పౌరులు మరణించారు. కాగా, ఉత్తర గాజాలోని జబల్యా శరణార్థుల శిబిరంలోని హాస్పిటల్‌పై ఇజ్రాయెల్ దాడి చేసింది. అక్కడ హమాస్ ఉగ్రవాదులు ఉన్నారని చెబుతూ దాడి చేయగా.. 18 మంది మరణించారు. సుమారు 20 మంది గాయపడ్డారు. గత 9 రోజుల్లో ఇజ్రాయెల్‌లో మూడు ఉగ్రదాడులు జరిగాయి. మొన్న టెల్ అవీవ్‌లో జరగ్గా బుధవారం హదేరాలో జరిగింది. దాడిలో ఆరుగురు ఇజ్రాయెలీ పౌరులు గాయపడగా పోలీసులు ఉగ్రవాదిని మట్టుబెట్టారు.

# సొంత గనులు కేటాయింపుతోనే స్టీల్ప్లాంట్కు పునరుజ్జీవం

- సెయిల్ నిర్వహణలోకి తీసుకెళ్లాలి
- ఈ రెండు మార్గాలు తప్ప, మరే మార్గం లేదు
- ఇప్పటికే రెండు సార్లు భేటీ అయినా ఎటువంటి స్పష్టమైన ప్రకటన లేదు



న్యూఢిల్లీ : వైజాగ్ స్టీల్ప్లాంట్కు సొంత గనులు కేటాయించడంతోనే పునరుజ్జీవం తీసుకురాగలరు. అలాగే సెయిల్లో విలీనం చేయడం లేదా సెయిల్ నిర్వహణలోకి స్టీల్ప్లాంట్ను తీసుకెళ్లడం మినహా మరో మార్గం లేదు. ఇంకే మార్గమైనా వైజాగ్ స్టీల్ప్లాంట్కు దానివల్ల ఒరిగేదేమీ ఉండదు. అది తాత్కాలికంగా తప్పించుకోవడానికే చేసినట్టు అవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆ మేరకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సి ఉంది. అప్పుడే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పే శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. ప్రభుత్వ రంగ సంస్థలకు సొంత గనులు కేటాయించాలని చట్టం స్పష్టంగా చెబుతుంది. అయినప్పటికీ ప్రైవేట్ కంపెనీలకు సొంత గనులు ఉన్నా, నవరత్న పరిశ్రమల్లో ఒకటైన వైజాగ్ స్టీల్ప్లాంట్కు ఇంతవరకు సొంత గనులు లేవు. ఈ విషయంలో ప్రభుత్వం పూర్తిగా సహాయ నిరాకరణ పాటిస్తున్నది. టిడిపి, జనసేన నేతలు ఎన్నికల ప్రచారంలో స్టీల్ప్లాంట్ను పరిరక్షిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఎన్నికల మేనిఫెస్టోలో కూడా దీనినే పునరుద్ఘాటించారు. అయితే అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు స్టీల్ప్లాంట్పై నిర్మాణాత్మక చర్యలు చేపట్టలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు సార్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామిలతో భేటీ అయ్యారు. కానీ ఎటువంటి స్పష్టమైన ప్రకటన వెలువడలేదు. ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి స్టీల్ప్లాంట్ను సందర్శించినప్పుడు, ప్రైవేటీకరణ చేయమని చెప్పి వెళ్లిపోయారు. తరువాత 4 వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించారు. విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అనే నినాదంతో కార్మికులు పోరాటాన్ని ఉధృతం చేశారు. దీంతో కేంద్ర ప్రభుత్వం, విశాఖ యాజమాన్యం తాత్కాలికంగా వెనక్కి తగ్గింది. ఆ సమయంలో రాష్ట్రంలోని అధికారంలో ఉన్న టిడిపి, జనసేన కార్మికులకు మద్దతు తెలపకపోగా, కనీసం నోరెత్తలేదు.ఈ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో సహా ఏడుగురు కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. ఈ సమావేశాల్లో తాను స్టీల్ప్లాంట్ అంశంపై చర్చించానని సిఎం తెలిపారు. అయితే దీనికి సంబంధించి ఇటు చంద్రబాబు నుంచి గానీ, అటు కేంద్ర మంత్రి కుమార స్వామి నుంచిగానీ ఎటువంటి నిర్మాణాత్మక ప్రకటన వెలువడలేదు. ఇది జటిలమైన సమస్య అని పేర్కొన్న చంద్రబాబు, ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నామని తెలిపారు. అయితే ఆ ప్రత్యామ్నాయ మార్గాల్లో వైజాగ్ స్టీల్ప్లాంట్కు సొంత గనులు కేటాయించడం, స్టీల్ప్లాంట్ను సెయిల్లో విలీనం, లేకపోతే సెయిల్ నిర్వహణలోకి తీసుకురావడం వంటివి ఉన్నాయా? అంటే సమాధానం లేదు.

సొంత గనులు కేటాయించడమే పరిష్కారం

వైజాగ్ స్టీల్ప్లాంట్కు సొంత గనులు కేటాయించడమే పరిష్కార మార్గమని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అన్నారు. వైజాగ్ స్టీల్ప్లాంట్కు సొంత గనులు కేటాయించే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని అన్నారు. లాభాల్లో ఉన్న స్టీల్ప్లాంట్ను తన సామర్థ్యాన్ని తగ్గిస్తున్నారని, సొంత గనులే కనుక ఉంటే వైజాగ్ స్టీల్ప్లాంట్ లాభాల్లో వెళ్తుందని అన్నారు. స్టీల్ప్లాంట్ సామర్థ్యాన్ని తగ్గేటట్లు కేంద్ర ప్రభుత్వప్రభుమే చేస్తోందని విమర్శించారు. సెయిల్లో వైజాగ్ స్టీల్ప్లాంట్ను విలీనం చేయడానికి కేంద్రప్రభుత్వానికి నొప్పేంటని ధ్వజమెత్తారు. సెయిల్లో ప్లాంట్ విలీనంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని అన్నారు. బ్యాంకులను విలీనం చేసినప్పుడు, వైజాగ్ స్టీల్ప్లాంట్ను సెయిల్లో ఎందుకు విలీనం చేయటం లేదని ప్రశ్నించారు. హెచ్పిసిఎల్ను ఒఎన్జిసిలో విలీనం చేసినప్పుడు, వైజాగ్ స్టీల్ప్లాంట్ను సెయిల్లో విలీనం ఎందుకు చేయరని ప్రశ్నించారు. ఈ ప్రక్రియ ఆలస్యం చేసేకొద్దీ స్టీల్ప్లాంట్కు ప్రతి రోజూ రూ.13 కోట్లు నష్టం వస్తుందని అన్నారు. స్టీల్ప్లాంట్కు అప్పులు ఇవ్వడం పరిష్కారం కాదని, ఎందుకంటే అప్పులకు వడ్డీలు పెరిగి మరింత నష్టం జరుగుతాదని అన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా 'ఆపరేషన్ బుడమేరు'

- ఆక్రమణలపై మూడు శాఖలతో సర్వే
- రాజధాని నిర్మాణానికి భారీగా రుణ సేకరణ
- పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ వెల్లడి



అమరావతి : నదులు, చెరువుల ప్రారతాల్లో ఆక్రమణలను తొలగిరచేరదుకు రాష్ట్ర వ్యాప్తంగా 'ఆపరేషన్ బుడమేరు' నిర్వహిరచాలని నిర్ణయిరచినట్లు రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొరగూరు నారాయణ తెలిపారు. తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాజధాని నిర్మాణం, పట్టణాభివృద్ధి, నగరాల అభివృద్ధి తదితర అంశాలపై వివరించారు. బుడమేరు వాగు తరహాలో ఇకపై రాష్ట్రంలోని ఏ ప్రాంతంలోనూ నష్టం రాకుండా చూసేందుకు కసరత్తు ప్రారంభించినట్లు చెప్పారు. ఇప్పటికే నెల్లూరు జిల్లాలోని కొన్ని ప్రారతాల్లో అక్రమణల తొలగిరపు పక్రియ ప్రారంభమైరదన్నారు. ఆపరేషన్ బుడమేరులో భాగంగా నీటిపారుదల శాఖ, పంచాయితీరాజ్, మున్సిపల్ శాఖలతో ఆక్రమణలపై సర్వే నిర్వహిస్తున్నట్లు నారాయణ చెప్పారు. త్వరలోనే సర్వే నివేదికలు అందుతాయని, అనంతరం తదుపరి కార్యాచరణపై నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. పబ్లిక్, ప్రయివేటు భాగస్వామ్యంతో పట్టణాలు, నగరాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. అన్ని పట్టణాల్లో తాగునీరు, పారిశుధ్యం వంటి అరశాలపైనా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. 2027 నాటికి అన్ని ప్రారతాల్లో ఇరటికో కుళాయిని ఏర్పాటుచేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పారిశుధ్య నివారణ, మురుగునీటి శుద్ధి కార్యక్రమాలపైనా చర్యలు తీసుకురటున్నట్లు ఆయన వివరిరచారు.

అమరావతిపై ప్రత్యేక దృష్టి

రాజధాని అమరావతి నిర్మాణంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు నారాయణ తెలిపారు. ముఖ్యమంత్రి కూడా ఈ అంశాన్ని ప్రత్యేకంగా తీసుకున్నట్లు తెలిపారు. 2027 చివరి నాటికి అన్ని నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని నిర్ణయిరచినట్లు చెప్పారు. ఈ నిర్మాణాలకు గతంలోనే దాదాపు 48 వేల కోట్ల రూపాయల టెరడర్లు పిలిచామని, ప్రస్తుతం వాటిని పూర్తిచేసేరదుకు ఐదు నురచి 10 శాతం అధిక వ్యయం అవుతురదని అరచనా వేసినట్లు తెలిపారు. కేంద్రం నురచి వచ్చే నిధులు కాకుండా హడ్కో, ప్రపంచబ్యారకు, జైకా, ఎఐబిపి నురచి రుణాలు సేకరిరచేరదుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

ఐకానిక్ టవర్లలోనే సిఎం కార్యాలయం

కొత్తగా నిర్మిరచే ఐకానిక్ టవర్లలోనే సిఎం కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి చెప్పారు. మొత్తం ఐదు భారీ టవర్లను నిర్మిరచనున్నామని, అరదులో ముఖ్యమంత్రి ఉరడే టవర్లో 54 అరతస్తులు ఉరటాయని చెప్పారు. మిగిలిన టవర్లలో 46 అరతస్తులు ఉరటాయన్నారు. సచివాలయానికి సంబంధించిన కార్యదర్శులు, అధికారులతో పాటు, అన్ని శాఖల అధిపతుల కార్యాలయాలు కూడా ఈ టవర్లలోనే ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల పనుల కోసం వచ్చే వారికి ఎక్కడెక్కడో తిరిగే శ్రమ తప్పుతురదన్నారు. వీటి నిర్మాణాలను రెండన్నర సంవత్సరాల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

వరదల నివారణకు నెదర్లాండ్స్ డిజైన్లు

రాజధాని ప్రారతంలో వరదలను నివారించడానికి, నీటి ఒత్తిడిని తట్టుకునేందుకు నెదర్లారడ్స్ సిఫార్సులు, డిజైన్లను అమలు చేయనున్నట్లు మంత్రి చెప్పారు. దీనికోసం 200 సంవత్సరాల నాటి వరద డేటాను అధ్యయనం చేస్తున్నట్లు చెప్పారు. ఈ డిజైన్లు నెలాఖరులోగా ఖరారవుతాయన్నారు. వీటిలో ఆరు రిజర్వాయర్ల నిర్మాణం, వరద నీరు ఎక్కువగా వచ్చినా తట్టుకునే నిల్వ సామర్థ్యం వంటివి కూడా ఉరటాయని చెప్పారు.అమరావతి నిర్మాణానికి సంబంధించి పాత టెరడర్లను రద్దు చేసి, కమిటీ నివేదిక మేరకు కొత్తగా పిలువనున్నట్లు తెలిపారు. నెలాఖరులోగా ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందని, డిసెరబర్లోగా కొత్త టెండర్లను ఖరారుచేసి జనవరి నురచి పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

## "మోడీ అద్భుతమైన వ్యక్తి"..
## పాకిస్తాన్‌కి ధమ్కీ ఇచ్చిన విషయాన్ని చెప్పిన ట్రంప్..



**న్యూఢిల్లీ,:** మరో నెల రోజుల్లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగబోతున్నాయి. రిపబ్లికన్ల తరుపున మాజీ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్, డెమొక్రాట్ల తరుపున ప్రస్తుత వైస్ ప్రెసిడెంట్ కమలా హ్యారిస్ యూఎస్ అధ్యక్ష పీఠం కోసం పోటీ పడుతున్నారు. వీరిద్దరి మధ్య పోరు ఎంతో రసవత్తరంగా ఉంది. ఇదిలా ఉంటే, అమెరికా ఎన్నికల్లో ఇండియా ఫ్యాక్టర్ కీలకంగా ఉంది. అమెరికాలో చాలా మంది భారత సంతతి ప్రజలు ఉన్నారు. వీరి ఓట్లు ఎన్నికల్లో కీలకంగా మారాయి. భాతర సంతతి ప్రజల్ని ఆకట్టుకునేందుకు ఇరు పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. ఇదిలా ఉంటే, ప్రధాని నరేంద్రమోడీని డొనాల్డ్ ట్రంప్ ప్రశంసించారు. 2019లో తాను ప్రెసిడెంట్‌గా ఉన్న సమయంలో హూస్టల్‌లో జరిగిన "హౌడీ మోడీ" సభపై మాట్లాడారు. కమిడియన్స్ ఆండ్రూ షుల్జ్, ఆకాష్ సింగ్‌తో కలిసి "ఫ్లాగ్రాంట్" పోడ్‌కాస్టులో ట్రంప్ పాల్గొన్నారు. ఈ భేటీలో పీఎం మోడీపై ప్రశంసలు కురిపించారు. మోడీ బయటకు శాంతంగా, తండ్రిలా కనిపిస్తారు కానీ, ఆయన కఠినంగా ఉండే మంచి వ్యక్తి అని అభివర్ణించారు. మోడీ తనకు ఎంతో మంచి మిత్రుడని, తమ మధ్య సంబంధాలు చాలా బాగుంటాయని చెప్పారు. 80,000 మంది ప్రజలు హౌడీ మోడీ సభకు హాజరైన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. అందేంతో క్రేజీగా ఉందని మోడీ, తాను(ట్రంప్) ఇద్దరు ప్రజలకు అభివాదం చేస్తూ సభలో నడిచిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. అయితే, తాను మోడీతో భారత్‌కి పాకిస్తాన్‌తో ప్రమాదం ఉందని, నేను వారితో వ్యవహరింగలనని ప్రధాని మోడీకి చెప్పానని ట్రంప్ వెల్లడించారు. " భారత్‌ని బెదిరించే పరిస్థితులు ఉన్నాయి. నేను సాయం చేయగలనని చెప్పాను. వారితో(పాకిస్తాన్)తో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని చెప్పాను. దీనికి మోడీ.. 'అవసరమైనది చేస్తా' 100 ఏళ్లుగా మేము వారిని ఓడిస్తున్నాం" అని పరోక్షంగా పాకిస్తాన్ గురించి మోడీ చెప్పిన విషయాన్ని ట్రంప్ వెల్లడించారు. 88 నిమిషాల సుదీర్ఘ ఇంటర్వ్యూలో 37 నిమిషాల సంభాషణ మోడీ చుట్టూనే తిరిగింది.

## వ్యక్తిగత ప్రయోజనాల వల్లే. హర్యానా ఓటమిపై సమీక్షలో రాహుల్



న్యూఢిల్లీ : హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత కాంగ్రెస్ పార్టీలో సమీక్షల పర్వం కొనసాగుతోంది. కాంగ్రెస్ అధిష్టానం గురువారం రాష్ట్ర నేతలతో తొలి కీలక సమావేశం నిర్వహించింది. పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే నివాసంలో జరిగిన ఈ సమావేశానికి ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా హాజరయ్యారు. జనరల్ సెక్రటరీ కెసి వేణుగోపాల్, హర్యానా రాష్ట్ర అధ్యక్షుడు ఉదయ్ భాన్, భూపేంద్ర సింగ్ హుడా, దీపక్ బబారియా, అశోక్ గెహ్లోట్, అజయ్ మాకెన్, ప్రతాప్ సింగ్ బజ్వాలు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల్లో వ్యక్తిగత ప్రయోజనాలు ఎక్కువగా చూసుకున్నారని అన్నట్లు సమాచారం. మొత్తం ఎన్నికల్లో పార్టీ ప్రయోజనాలే ప్రధానమని రాహుల్ అన్నారు. ఎన్నికల ఫలితాలపై విచారణ జరిపేందుకు ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీని ఏర్పాటు చేయనున్నామని, దానిని త్వరలో ప్రకటిస్తామని రాహుల్ అన్నట్లు తెలిసింది. సమావేశం ముగిసిన తర్వాత అజయ్ మాకెన్ మాట్లాడుతూ ఫలితాలు షాకింగ్ గా, ఊహించని విధంగా వున్నాయని అన్నారు. కెసి వేణుగోపాల్ మాట్లాడుతూ హర్యానాలో ఓటమికి గల కారణాలపై నేటి సమావేశంలో చర్చించాం. మా విశ్లేషణ కొనసాగిస్తాం. తదుపరి చర్యలు ఏమిటన్నది తర్వాత చెబుతుం అని వేణుగోపాల్ అన్నారు.

## హర్యానా ఫలితాలు కాంగ్రెస్ నిజ నిర్ధరణ కమిటీ ఏర్పాటు!



చండీగఢ్: హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ నిజ నిర్ధరణ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. హర్యానాలో ఊహించని ఫలితాలు రావడంతో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, అశోక్ గహ్లోత్ తదితరులు బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నిజ నిర్ధరణ కమిటీ ఏర్పాటు చేయాలనే నిర్ణయానికి కాంగ్రెస్ నేతలు వచ్చినట్లు సమాచారం. సమీక్ష అనంతరం.. హర్యానా అసెంబ్లీ ఎన్నికలకు ఏఐసీసీ అబ్జర్వర్, కాంగ్రెస్ నేత అజయ్ మాకెన్ మీడియాతో మాట్లాడారు." మేము హర్యానా ఎన్నికల ఫలితాలపై సమీక్షా సమావేశం నిర్వహించాం. ఎన్నికల పోల్ ఫలితాలు చాలా అనూహ్యమైనవి. ఎగ్జిట్ పోల్స్, వాస్తవ ఫలితాల మధ్య చాలా వ్యత్యాసం ఉంది.ఈ వ్యవహారంపై మేము ఏం చేయాలో నిర్ణయించుకున్నాం.దాని ప్రకారమే ముందుకు వెళ్తాం" అని అన్నారు. హర్యానా ఎన్నికలక ఏఐసీసీ సీనియర్ పరిశీలకుడు, కాంగ్రెస్ నేత అశోక్ గెహ్లాట్ మీడియాతో మాట్లాడారు." మేము హర్యాలో పొందిన ఓటమిని చాలా తీవ్రంగా పరిగణిస్తున్నాం. కాంగ్రెస్ పార్టీ హర్యానాలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ప్రజలు అభిప్రాయ పడినట్లు పలు ఎగ్జిట్ పోల్స్ వెల్లడించాయి. అందుకే ఈ వ్యవహారంలో పూర్తిగా పరిశీలన జరపాల్సిన అవసరం ఉంది" అని అన్నారు. ప్రతికూల ఫలితాల్చిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ పద్ధతి, ఈవీఎంల పనితీరును కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా తప్పుబట్టిన విషయం తెలిసిందే. కొన్ని జిల్లాల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపించింది. ఇక.. హర్యానా అసెంబ్లీ ఎన్నికలలో బిజెపి అద్భుతమైన విజయం సాధించింది. కాంగ్రెస్ ఆశలు ఆవిరి చేస్తూ 90 అసెంబ్లీ స్థానాలకు గానూ 48 సీట్లు కైవసం చేసుకుంది. కాంగ్రెస్ 37 స్థానాల్లో గెలుపొందింది. 1966లో రాష్ట్రం ఆవిర్భవించినప్పటి నుంచి బీజేపీ ఇన్ని సీట్లు సాధించడం ఇదే తొలిసారి.

## మోడీ దసరా కానుక-ఏపీకి రూ. 7211 కోట్లు
## తెలంగాణకు రూ.3745 కోట్లు..!



**న్యూఢిల్లీ,:** తెలుగు రాష్ట్రాలకు ప్రధాని మోడీ దసరా కానుక ఇచ్చారు. దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాలతో పాటు తెలుగు రాష్ట్రాలకు కూడా పన్నుల వాటాను విడుదల చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం ఏపీ, తెలంగాణ తమకు పన్నుల్లో రావాల్సిన వాటాను అందుకోబోతున్నాయి. అసలే నిధుల కొరతతో అల్లాడుతున్న తెలుగు రాష్ట్రాలకు ఇది పండుగ వేళ కేంద్రం శుభవార్తగా భావిస్తున్నారు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. ఏడాది పొడవునా వసూలయ్యే పన్నుల్లో రాష్ట్రాలకు కేంద్రం నిబంధనల ప్రకారం తమ వాటాను ఉంచుకుని మిగిలింది ఇవ్వాల్సి ఉంటుంది. వీటిని దశల వారీగా కేంద్రం విడుదల చేస్తుంటుంది. దీని ప్రకారం అన్ని రాష్ట్రాలకు కలిపి లక్షా 78 వేల కోట్లను విడుదల చేస్తోంది. ఇందులో ఏపీకి రూ.7221 కోట్లు పన్నుల వాటాగా ఇవాళ విడుదల చేశారు. అలాగే తెలంగాణకు రూ.3745 కోట్లను పన్నుల వాటాగా విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు ఇవ్వాల్సిన రూ.1,78,173 కోట్ల పన్ను పంపిణీని ఇవాళ విడుదల చేసిందని, ఇందులో అక్టోబరు, 2024లో చెల్లించాల్సిన సాధారణ వాయిదాకు అదనంగా ఒక ముందస్తు వాయిదా రూ.89,086.50 కోట్లు కూడా ఉన్నట్లు ఆర్థిక మంత్రిత్వశాఖ తెలిపింది. రాబోయే పండుగల సీజన్ దృష్ట్యా, రాష్ట్రాలు మూలధన వ్యయాన్ని వేగవంతం చేయడానికి, వారి అభివృద్ధి/సంక్షేమ సంబంధిత వ్యయాలకు ఆర్థిక సహాయం చేయడానికి ముందస్తు వాయిదాలు విడుదల చేసినట్లు కేంద్రం తెలిపింది.

# పోటీ పరీక్షలకు ప్రామాణిక పుస్తకాలేవి..

పోటీ పరీక్షలు అంటేనే అనేక విషయాలపై మంచి పట్టు సాధించాలి. వీటికి సిద్ధమయ్యే అభ్యర్థులు ప్రైవేట్ పుస్తకాల కన్నా తెలుగు అకాడమీ ముద్రించే పుస్తకాలను ప్రామాణికంగా భావిస్తారు. పోటీ పరీక్షల నిపుణులు సైతం మొదటగా తెలుగు అకాడమీ పుస్తకాలను చదవాలని సూచిస్తుంటారు. ఎందుకంటే పోటీ పరీక్షలలో వచ్చే మెజార్టీ ప్రశ్నలను తెలుగు అకాడమీ, పాఠశాల బోర్డు, యూనివర్శిటీ పుస్తకాలను ఆధారం చేసుకొని ఇస్తుంటారు. ఇప్పటికే తెలుగు అకాడమీ పోటీ పరీక్షల నిమిత్తం పలు పుస్తకాలను ప్రచురించింది. ఈ పుస్తకాలను అనుభవజ్ఞులైన విషయ నిపుణులచే రూపొందించడం జరుగుతుంది. పైగా ఆ పుస్తకాలపై తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వారు విడుదల చేసిన పలు ఉద్యోగ ప్రకటనల నిమిత్తం అని, సిలబస్‌ను దృష్టిలో ఉంచుకుని ముద్రించడం జరిగిందని ముందుమాటలో స్పష్టంగా పేర్కొంటారు. ఈ పుస్తకాలు రాయడానికి నిపుణులు పలు పుస్తకాలను రెఫరెన్స్‌గా తీసుకుంటారు. ఈ అకాడమీ విషయ కూర్పులో, భాష విషయంలో కచ్చితమైన ప్రమాణాలు పాటిస్తూ పుస్తకాలు రచిస్తుంది.

### తెలుగు అకాడమీవి ప్రామాణికం కాదా?

2024 జూన్ 9న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించింది. అనంతరం ప్రశ్న పత్రానికి ప్రాథమిక కీ విడుదల చేసి, అభ్యర్థుల నుంచి అభ్యంతరాలను స్వీకరించింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా 7191 అభ్యంతరాలు వచ్చాయి. వీటిని పరిశీలించిన టీజీపీఎస్సీ తుది కీ లో రెండు ప్రశ్నలను మాత్రమే తొలగించి ప్రిలిమ్స్ ఫలితాలను ప్రకటించింది. కానీ తుది కీ లో దాదాపు 14 ప్రశ్నలకు సమాధానాలు తప్పులున్నాయని ఆధారాలతో అభ్యర్థులు తెలంగాణ హైకోర్ట్‌ను ఆశ్రయించారు. ఇందులో కచ్చితంగా 5 నుంచి 6 ప్రశ్నలకు తప్పుడు సమాధానాలున్నట్లు విషయ నిపుణులు సైతం చెబుతున్నారు. వీటికి రిఫరెన్స్‌గా తెలుగు అకాడమీ పుస్తకాలను, అధికారిక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖల అధికారిక సమాచారాన్ని చూపిస్తూ కోర్టులో సమర్పించారు. వీటికి స్పందనగా హైకోర్టు టీజీపీఎస్సీ బోర్డును కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. అయితే బోర్డు దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్‌లో తెలుగు అకాడమీ పుస్తకాలు ప్రామాణికం కాదని పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా అకాడమీ పుస్తకాలు సరైన పరిశోధన లేకుండా రాసినవనడం చాలా బాధాకరం.

### ఈ సమస్య పరిష్కరించకపోతే..

టీజీపీఎస్సీ ఒక రాజ్యాంగబద్ధ సంస్థ తన తప్పును కప్పిపుచ్చుకోవడానికి ఏళ్ల చరిత్ర ఉన్న తెలుగు అకాడమీ ప్రతిష్టకు




దెబ్బతీయడం ఎంతవరకు సమంజసనీయమని మేధావుల ప్రశ్న? అలాంటప్పుడు ఎంతో వ్యయంతో పుస్తకాలను ముద్రించడం ఎందుకు? గతంలో పలు పోటీ పరీక్షల్లో అకాడమీ పుస్తకాలను రిఫరెన్స్‌గా ధ్రువీకరించిన బోర్డ్, ఇప్పుడు గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష కీ విషయంలో ప్రామాణికం కాదనడం హాస్యాస్పదం. అభ్యంతరాలను అధికారికంగా వనరుల(%ఖబ్ష్రవత్‌ఆఎ ంశీబతీఎవ%)నుంచి మాత్రమే స్వీకరిస్తామని స్పష్టం చేసిన బోర్డ్ ప్రవేట్ పుస్తకాలను, వికీపీడియాను కూడా రిఫరెన్స్‌గా చూపించడమేంటి? దీంతో అసలు పోటీ పరీక్షలకు ప్రామాణిక పుస్తకాలు ఏమిటని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు? ఈ సమస్య పరిష్కరించకపోతే రానున్న కొన్ని నెలల్లో బోర్డ్ నిర్వహించే గ్రూప్-3, గ్రూప్-2 పరీక్షల ప్రశ్నల కూర్పు, సమాధానాల విషయంలో సంకట పరిస్థితి ఎదురుకానుంది. ఇప్పటికే గ్రూప్స్, పోలీసు ఉద్యోగాలు, టీచర్ ఉద్యోగాల కోసం సిద్ధమయ్యే చాలామంది అభ్యర్థులు తెలుగు అకాడమీ పుస్తకాలనే ప్రమాణికమని చదువుతున్నారు.

### గెలుపు ఎవరిది?

పోటి పరీక్షల్లో ఒక్క మార్క్‌తో అభ్యర్థుల తలరాతలు మారుతాయి. ప్రస్తుతం గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష కీ విషయంలో టీజీపీఎస్సీ వింత వాదన వల్ల అభ్యర్థుల నష్టపోయే అవకాశం ఉంది. దీంతో పబ్లిక్ సర్వీస్ కమిషన్‌పై నమ్మకం సన్నగిల్లుతుంది. ఇప్పటికే గత టీజీపీఎస్సీ బోర్డ్ ఆధ్వర్యంలో 2022 గ్రూప్-1 పరీక్ష రెండుసార్లు రద్దయింది. ఇప్పుడు కొత్త బోర్డు ఆధ్వర్యంలో ఇదే గ్రూప్-1 నూతన నోటిఫికేషన్‌లో ఎదురవుతున్న సవాళ్లు మరోసారి అభ్యర్థుల పాలిట శాపంగా మారాయి. ప్రస్తుతం మెయిన్స్ ఎంపిక విషయంలో తీసుకొచ్చిన నూతన జీ.వో 29, తప్పుడు కీ, పాత నోటిఫికేషన్ రద్దు, ఎస్టీ రిజర్వేషన్ పెంపు లాంటి సమస్యలు కోర్ట్ పరిధిలో ఉన్నాయి. టీజీపీఎస్సీ వాటినీ పరిష్కరించి అభ్యర్థులకు నష్టం వాటిల్లకుండా చూడాలి. గతంలో తప్పుడు కీ విషయంలో 2011లో జరిగిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష ఆరు సంవత్సరాల తరువాత రద్దయి మళ్లీ 2016లో జరిగింది. ప్రస్తుత గ్రూప్-1 నోటిఫికేషన్‌లో ఆ తప్పు జరగకుండా ఉండాలంటే కేసులు పరిష్కరించాక మెయిన్స్ ఎగ్జామ్ నిర్వహించాలి. దీనికోసం అభ్య ర్థులు పలుమార్లు టీజీపీఎస్సీ కీ వినతి పత్రం ఇచ్చారు. కానీ బోర్డు ఆ దిశలో ఆలోచించకుండా ముందుకెళ్లడంతో అభ్యర్థుల్లో ఆందోళన మొదలైనది. ఈ నేపథ్యంలో అభ్యర్థులు న్యాయం కోసం చదువును పక్కనే పెట్టి కోర్ట్ చుట్టూ తిరుగుతున్నారు. ఇటీవల టీజీపీఎస్సీ బోర్డు, అభ్యర్థుల పక్షాన జరిగిన వాదనలు విన్న హైకోర్ట్ జడ్జి తుది తీర్పును అక్టోబర్ 14 నాటికి రిజర్వ్ చేశారు. ఈ కేసులో తుది తీర్పు ఆసక్తిగా మారింది. ఇది టీజీపీఎస్సీ గెలుపా? లేదా తెలుగు అకాడమీ, అభ్యర్థుల గెలుపా? అన్నట్టు ఉన్నది. ఏది ఏమైనా పోటీ పరీక్షల్లో ఎన్ని అడ్డంకులు ఎదురైనా విజయం వరించాలంటే అభ్యర్థులు చదువనే యుద్ధం చేయాల్సిందే.

# సరికొత్త అధ్యాయమయ్యేనా?!





అక్టోబర్ 8 నాటి ఎన్నికల ఫలితాలు కేంద్రంలోని అధికార ఎన్డీఏ కూటమికీ, ప్రతిపక్ష 'ఇండియా' కూటమికీ సమాన స్కోర్లు అందించాయి. హర్యానాలో బీజేపీ, జమ్ము-కశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) - కాంగ్రెస్ కూటమి విజయం సాధించడంతో లెక్క సమం అయింది. అయితే, ఈ ఫలితాల అసలు ప్రభావం ఈ అంకెల లెక్కకు మించినది. అన్ని అంచనాలనూ తలకిందులు చేస్తూ... హర్యానాలో వరుసగా మూడోసారి విజయంతో బీజేపీ రికార్డ్ సృష్టించడం ఒక ఎత్తయితే, జమ్ము-కశ్మీ ర్‌లో దాదాపు ఆరేళ్ళ పైచిలుకు తర్వాత మళ్ళీ ప్రజలెన్నుకున్న ప్రభుత్వం కొలువు తీరనుండడం మరో ఎత్తు. కశ్మీర్ ఎన్నికల ఫలితాలు అనేక కారణాల రీత్యా అత్యంత కీలకమైనవి. వాటి ప్రకంపనలు, ప్రభావం కేవలం ఆ ప్రాంతానికే పరిమితం కావు. లెఫ్టినెంట్ గవర్నర్‌కు ప్రాధాన్యమిచ్చి, శాసనవ్యవస్థ అధికారానికి రెక్కలు కత్తిరించిన పరిస్థితుల్లో కశ్మీర్‌లో ప్రభుత్వాన్ని నడపడం కత్తి మీద సాము కానుంది. అదే సమయంలో రాష్ట్రహోదాను పునరుద్ధరించాలన్న ప్రజాకాంక్ష అక్కడి ఎన్నికల ఫలితాల్లోనూ ప్రతిఫలించడంతో ఎన్సీ కూటమి ఆ దిశగా కృషి చేయాల్సి ఉంటుంది. రాష్ట్ర హోదాపై ఎన్నికల వేళ ఇచ్చిన హామీని కేంద్ర పెద్దలు, బీజేపీ అధినాయకులు నిలబెట్టుకుంటారా, లేక తమ పార్టీ అధికారంలోకి రాలేదు గనక 'అంతా తూ ' అనేస్తారా అన్నది చర్చనీయాంశమైంది. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన ఆర్టికల్ 370 రద్దు తర్వాత, రాష్ట్రాన్ని జమ్ము - కశ్మీర్, లద్దాఖ్ అంటూ రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించిన తర్వాత జరిగిన తొట్టతొలి ఎన్నికలు ఇవే. ఆసక్తిగా చూస్తుండగా, పోటాపోటీగా, అదే సమయంలో శాంతియుతంగా ఈ ఎన్నికలు సాగడం విశేషం. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల కన్నా 5 శాతం పైచిలుకు ఎక్కువగా, పెద్దయెత్తున 63.9 శాతం వరకు ఓటింగ్ జరగడం గమనార్హం. అంటే, ఎన్నికల ప్రజాస్వామ్యం వైపు ప్రజల మొగ్గు సుస్పష్టం. జనమిచ్చిన మెజారిటీతో కశ్మీర్‌లో ఇక ఎన్సీ - కాంగ్రెస్ కూటమి ప్రభుత్వం కొలువు తీరనుంది. అతి పెద్ద పార్టీగా అవతరించిన ఎన్సీ పక్షాన ఒమర్ అబ్దుల్లా సీఎం కానున్నారు. ఇలా కశ్మీర్‌లో ప్రజాస్వామ్యబద్ధ ప్రభుత్వం తిరిగి రావడం ఒక శుభసూచన. ఎన్నికైన సర్కారుండడంతో స్థానిక ప్రజలు తమ కష్టనష్టాల పరిష్కారానికై ప్రజాప్రతినిధుల్ని ఆశ్రయించే వీలు చిక్కింది. అతివాద బీజేపీని ద్వితీయ స్థానానికే పరిమితం చేసి, మితవాద దృక్పథమున్న ఎన్సీకి పట్టం కట్టడం ద్వారా ప్రజాపాలనకై తాము తహతహలాడుతున్నట్టు కశ్మీరీలు చెప్పకనే చెప్పారు. ఒమర్ తండ్రి ఫరూఖ్ అబ్దుల్లా నేతృత్వంలోని ఎన్సీ - కాంగ్రెస్ కూటమి కశ్మీర్ లోయ వరకు మొత్తం 47 సీట్లలో 42 స్థానాలను గెలవడం విశేషం. ముస్లిమ్ జనాభా అధికంగా ఉండే లోయలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల పట్ల స్థానిక ప్రజల వ్యతిరేకతకు అది అద్దం పడుతోంది. ఇక లోయలో ఖాతా తెరవలేకపోయినా, హిందువులు ఎక్కువైన జమ్ములో మాత్రం పోటీ చేసిన 43 సీట్లలో 29 గెలిచి, బీజేపీ తన బలం నిరూపించుకుంది. కాంగ్రెస్ మొత్తం 6 సీట్లలో విజయంతో మూడో స్థానంలో నిలిచింది. మెహబూబా ముఫ్తీ సారథ్యంలోని పీడీపీ 3 సీట్లు, 'ఇంజనీర్' రషీద్ సారథ్యంలోని వేర్పాటువాద అవామీ ఇత్తెహాద్ పార్టీ ఒక సీటే గెలిచి, బరిలో చతికిలబడ్డాయి. ఒకప్పుడు ఉమ్మడి కశ్మీర్‌కు సీఎంగా పనిచేసిన ఒమర్ ఇప్పుడు లద్దాఖ్‌ను విడగొట్టిన తర్వాత ఏర్పడ్డ విభజిత కశ్మీర్‌కు తొలి సీఎం. కానీ, ప్రభుత్వాన్ని నడపడం సులభం కాదు. సవాళ్ళు తప్పవు. ఆ మాట అంగీకరిస్తూనే, కేంద్ర ప్రభుత్వంతో సత్సంబంధాలు పెట్టుకుంటామనీ, అదే సమయంలో రద్దయిన ప్రత్యేక ప్రతిపత్తి ఆర్టికల్ 370 పునరుద్ధరణకు డిమాండ్ చేస్తూనే ఉంటామనీ ఒమర్ స్పష్టం చేశారు. అది ఆయన అనివార్యత, లోయ ప్రజల ఆకాంక్ష. అయితే అంతకన్నా ముఖ్యం... జనం వర్గాలుగా చీలి, ఓటేసిన నేపథ్యంలో జమ్మూను వేరుగా చూడకుండా కలుపుకొని పోతూ, అక్కడి ప్రజాప్రతినిధులకు క్యాబినెట్‌లో పెద్దపీట వేయడం! ఆ సంగతి ఒమర్‌కూ తెలుసు. జమ్ముతో పోలిస్తే కశ్మీర్ లోయలోనే ఎక్కువ స్థానాలొచ్చినా రెండు ప్రాంతాలూ తమకు సమానమే ననీ, అందరి ప్రభుత్వంగా ప్రాంతాల మధ్య అంతరాన్ని తొలగిస్తామనీ ఆయన ప్రకటించారు. ఆర్టికల్ 370 పాత చరిత్ర, తప్పొప్పుల మాట అటుంచితే, అంత కన్నా ముఖ్యమైనది జమ్ము - కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించడం! ఎందుకంటే, కేంద్రపాలిత ప్రాంతమయ్యే సరికి 370 రద్దుకు ముందు రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నన్ని అధికారాలు ఉండవు. చివరకు పోలీసులు సైతం కేంద్రం కనుసన్నల్లోనే ఉంటారు. ఎన్నికలు పూర్తయి, ప్రజాప్రభుత్వం వచ్చింది గనక, తక్షణమే రాష్ట్రహోదా దిశగా అడుగులేయాలి. గత డిసెంబర్‌లో సుప్రీమ్‌కోర్ట్ సైతం సత్వరమే పూర్తిస్థాయి రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని చెప్పిందన్నది గమనార్హం. అన్ని రాజకీయ పక్షాలూ కోరు తున్నట్టు ఆ విషయంలో కేంద్రం తన హామీని నిలబెట్టుకోవాలి. కశ్మీర్‌లో సైతం అన్ని రాష్ట్ర ప్రభు త్వాల తరహాలోనే కొత్త సర్కార్ పని చేసే వీలు కల్పించాలి. కశ్మీర్‌కి ప్రత్యేక భౌగోళిక, సాంస్కృతిక చరిత్ర ఉన్న మాట నిజమే కానీ, దాన్ని గుర్తిస్తూనే ఆ ప్రాంతం మిగతా దేశంతో కలసి అడుగులు వేసేలా కృషి సాగాలి. యువతరంలో నిరుద్యోగం దేశంలోనే అధికంగా ఉన్న ఆ ప్రాంత సామాజిక, ఆర్థిక పురోగతి అందుకు కీలకం. అలాగే గత అయిదేళ్లలో స్థానిక ఆకాంక్షలకు భిన్నంగా తీసుకున్న మైనింగ్, భూసేకరణ లాంటి విధానాల పునఃసమీక్ష అవసరం. లెఫ్టినెంట్ గవర్నర్, కేంద్రం సహకరిస్తేనే అది సాధ్యం. లేదంటే, ఢిల్లీలో ఆప్ సర్కార్ తరహా కథే కశ్మీర్‌లో పునరావృతమవుతుంది. ఎన్నికలు జరిపి కూడా ప్రజాతీర్పును తోసిపుచ్చినట్టే అవుతుంది. పైగా, సరిహద్దులో శత్రు వులు పొంచి ఉండే సున్నితమైన ప్రాంతంలో అలాంటి రాజకీయ క్రీడలు ప్రమాదకరం.

# యంత్రమా.. కుతంత్రమా

**అత్యధిక ఓట్లు వచ్చిన కాంగ్రెస్‌కు తక్కువ సీట్లు రావడంపై సర్వత్రా సందేహాలు**


**తిరిగి బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు నిర్వహించాలంటూ పెరుగుతున్న డిమాండ్**

**మొన్నటి సాధారణ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్, ఒడిశా ఫలితాలపై ఏడీఆర్, వీడీఎఫ్ అనుమానాలు**

**ఏపీలో పార్లమెంట్ సీట్ల లెక్కింపుల్లో.. పోలైన ఓట్లకంటే 49 లక్షల ఓట్లు పెరిగాయన్న వీడీఎఫ్**

**ఆ రెండు సంస్థలు వ్యక్తం చేసిన అనుమానాలను ఇప్పటికీ నివృత్తి చేయని ఈసీ**

అమరావతి: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల (ఈవీఎంలు) పనితీరుపై దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలు, స్వచ్ఛంద సంస్థలు, సామాజికవేత్తల నుంచి సాధారణ ప్రజల వరకూ వ్యక్తం చేస్తున్న అనుమానాలను తాజాగా వెల్లడైన హరియాణా ఎన్నికల ఫలితాలు మరింత పెంచాయి. అత్యధిక ఓటింగ్ శాతంతో అత్యధిక ఓట్లు పొందిన కాంగ్రెస్ పార్టీ 37 స్థానాలకు పరిమితం కాగా ఆ పార్టీ కంటే తక్కువ ఓట్లు వచ్చిన బీజేపీకి 48 సీట్లు రావడంతో ఈ సందేహాలు మరింత పెరిగాయి. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఈవీఎంల వినియోగానికి సంబంధించి పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు హరియాణా ఎన్నికల ఫలితాల అనంతరం ఈ అనుమానాలు బలపడటంతో ప్రజాస్వామ్య పరిరక్షణకు బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు నిర్వహించాలన్న డిమాండ్ దేశవ్యాప్తంగా పెరుగుతోంది. సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ సహా దేశవ్యాప్తంగా పలు పోలింగ్ కేంద్రాల్లో పోలైన ఓట్లకు, లెక్కింపులో వచ్చిన ఓట్లకు మధ్య భారీ తేడాలు ఉన్నట్లు వోట్ ఫర్ డెమోక్రసీ (వీఎఫ్‌డీ), అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) సంస్థలు



ఆధారాలతో సహితంగా బహిర్గతం చేసిన విషయం తెలిసిందే. వైఎస్సార్ సీపీ కూడా ఈవీఎంల పనితీరుపై పలు సందేహాలను వ్యక్తం చేయడం విదితమే.

ఈసీ మౌనంతో పెరుగుతున్న అనుమానాలు

ఈవీఎంలపై తలెత్తిన సందేహాలను నివృత్తి చేయాల్సిన కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) తొలి నుంచీ మౌనం వహిస్తుండటం అనుమానాలను మరింత పెంచుతోంది. ఫలితాలు వెల్లడైన వెంటనే అప్‌లోడ్ చేయాల్సిన ఫారం- 20 వివరాలపై తీవ్ర జాప్యం చేయడం ఈ ఆరోపణలకు బలాన్ని చేకూరుస్తోంది. ఫారం - 20లో ఆయా అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రతి అభ్యర్థికి పోలైన ఓట్ల వివరాలు ఉంటాయి. దీని ద్వారా ప్రతి నియోజకవర్గంలో పోటీ చేసిన ఒక్కో అభ్యర్థికి ఎన్ని ఓట్లు పోలయ్యాయి? లెక్కింపులో ఎన్ని ఓట్లు వచ్చాయి? అనేది తెలిసిపోతుంది. సాధారణంగా ఫారం-20ని ఓట్ల లెక్కింపు జరిగిన వారం రోజుల్లోనే వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు. అయితే ఎన్నికల సంఘం ఈసారి ఈ వివరాలను వెంటనే వెల్లడించలేదు. ఎన్నికల కౌంటింగ్ జరిగిన 108 రోజుల తర్వాత తాపీగా గత నెల 19న నియోజకవర్గాలవారీగా పార్లమెంటు, శాసన సభ స్థానాలకు లెక్కించిన ఓట్ల వివరాలతో ఫారం-20ని 'సీఈవో ఆంధ్ర' వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసింది. ఇంత ఆలస్యంగా వెల్లడించడంపై పలు అనుమానాలు ముసురుకుంటున్నాయి.

భారీగా పెరిగిన పోలింగ్ శాతం

ప్రతి ఎన్నికల్లో పోలింగ్ రోజు ఈసీ ప్రాథమికంగా పోలింగ్ శాతాన్ని ప్రకటిస్తుంది. ఆ తర్వాత రోజు తుది శాతాలను ప్రకటిస్తుంది. అయితే ఈసారి పోలింగ్ తుది శాతాన్ని ప్రకటించేందుకు ఏకంగా నాలుగు రోజుల సమయం తీసుకుంది. అందులోనూ ప్రాథమికంగా పోలైన ఓట్లకు, తుది ఓట్లకు మధ్య భారీ తేడాలు ఉన్నాయి. ఇలా తుది శాతాల ప్రకటనకు సుదీర్ఘ సమయం తీసుకోవడం, భారీ తేడాలు రావడంతో అనుమానాలకు బీజం పడింది. మే 13న రాష్ట్ర అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలకు పోలింగ్ జరిగింది. ఆరోజు రాత్రి 8 గంటలకు తొలుత పోలింగ్ శాతాన్ని ఎన్నికల సంఘం ప్రకటించింది. తుది శాతాన్ని నాలుగు రోజులు ఆలస్యంగా మే 17న ప్రకటించింది. రాష్ట్రంలో ఈ రెండు పోలింగ్ శాతాల మధ్య 12.54 శాతం పెరుగుదల ఉంది. రాష్ట్రంలో పోలైన ఓట్లలో ఏకంగా 49 లక్షల ఓట్లు అదనంగా పెరిగాయి. రాష్ట్రంలోని 25 లోక్‌సభ నియోజకవర్గాల్లో సగటున 1.96 లక్షల ఓట్లు అదనంగా పోలయ్యాయి. ఇది ఎన్నికల ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపిందని వోట్ ఫర్ డెమొక్రసీ (వీఎఫ్‌డీ) సంస్థ స్పష్టం చేసింది.

దేశవ్యాప్తంగా 538 స్థానాల్లో తేడాలు..

దేశవ్యాప్తంగా 543 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగ్గా.. 538 ఎంపీ స్థానాల్లో పోలైన ఓట్లు, లెక్కించిన ఓట్లకు మధ్య భారీ తేడాలు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్), వీఎఫ్‌డీ సంస్థలు పేర్కొన్నాయి. 362 నియోజకవర్గాల్లో పోలైన ఓట్ల కంటే 5,54,598 ఓట్లను తక్కువగా లెక్కించినట్లు తమ అధ్యయనంలో వెల్లడైందని తెలిపాయి. 176 లోక్‌సభ స్థానాల్లో 35,093 ఓట్లకుపైగా అదనంగా లెక్కించారని వెల్లడించాయి.పోలైన ఓట్ల ప్రకారం చూస్తే ఏపీలో కూటమికి 14, వైఎస్సార్‌సీపీకి 11 లోక్‌సభ స్థానాలు దక్కాలని వీడీఎఫ్ స్పష్టం చేసింది. తమ అధ్యయన నివేదికలను ఎన్నికల సంఘానికి కూడా పంపాయి. పోలైన ఓట్లకు, లెక్కించిన ఓట్లకు మధ్య భారీ వ్యత్యాసం ఉండటానికి కారణాలు ఏమిటో వెల్లడించాలని ఏడీఆర్, వీఎఫ్‌డీ సంస్థల ప్రతినిధులు ఎన్నికల సంఘాన్ని అప్పట్లోనే ప్రశ్నించారు. కానీ.. ఎన్నికల సంఘం ఇప్పటికీ దీనిపై స్పందించకపోవడం గమనార్హం.

# 'మేక్ ఇన్ ఇండియా' ఏమైంది?




గత పది సంవత్సరాల క్రితం దేశమంతా హోరెత్తిన 'మేక్ ఇన్ ఇండియా' (భారత్‌లో తయారీ) మూగబోయింది. మేక్ ఇన్ ఇండియా గుర్తు అయిన ముందుకు అడుగు వేసే సింహం కదలకపోగా వెనకడుగు వేస్తున్నట్లు వుంది. 2014 సెప్టెంబర్ 25న ఈ పథకాన్ని ప్రారంభించినప్పుడు 2024 నాటికి మూడు లక్ష్యాలను సాధించాలని నిర్ణయించుకున్నారు. అవి ఒకటి, తయారీ రంగం వృద్ధి రేటును సంవత్సరానికి 12 నుండి 14 శాతానికి పెంచడం. రెండు, 2022 నాటికి ఆర్థిక వ్యవస్థలో పది కోట్ల మందికి అదనపు ఉద్యోగాలు ఇవ్వడం. మూడు, దేశ స్థూల జాతీయోత్పత్తిలో ఉత్పాదక రంగం వాటాను 25 శాతానికి పెంచడం. 'అనుకున్నదొక్కటి అయ్యిందొక్కటి' లాగా ఈ పథకం అమలు తీరు వుంది. అందుకే పది సంవత్సరాలు పూర్తయినా 'మేక్ ఇన్ ఇండియా' సాధించింది ఏమిటో కేంద్ర ప్రభుత్వం, దాని అధినాయకులు చెప్పడంలేదు. భారత దేశాన్ని ప్రపంచ అభివృద్ధి చెందిన దేశాల సరసన కూర్చోబెట్టాలంటే దేశీయ తయారీ రంగం అభివృద్ధి కావాలని అందుకు దేశంలోనే ఉత్పత్తి చేయడంపై దృష్టి పెట్టి, దిగుమతులను తగ్గించాలని పది సంవత్సరాల క్రితం కొత్తగా అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం ప్రకటించింది. దానికి 'మేక్ ఇన్ ఇండియా' అని పేరు పెట్టి 15 తయారీ రంగాలు, 12 సేవారంగాలపై దృష్టి పెట్టాలని నిర్ణయించారు. అందులో ఆటోమొబైల్స్, టెక్స్‌టైల్స్, ఎలక్ట్రానిక్స్, ఫార్మాస్యూటికల్స్, డిఫెన్స్, మాన్యుఫాక్చరింగ్, పునరుత్పాదక ఇంధన రంగాలపై ప్రత్యేక కేంద్రీకరణ చేయనున్నట్లు చెప్పారు. ఈ రంగాల్లో సాధించే పురోభివృద్ధి వల్ల పై మూడు లక్ష్యాలను సాధించి ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా దేశాన్ని నిలిపి 'విశ్వగురువు'గా అవతరిస్తామని చెప్పారు. వాస్తవానికి ఈ ఆలోచన మోడీ లేదా ఆయన ప్రభుత్వానిది కాదు, ప్రపంచ బ్యాంకుది. ప్రపంచమంతటా ఒకే తరహా ప్రైవేటీకరణ విధానాన్ని అమలు చేయడానికి ప్రపంచబ్యాంకు రూపొందించిన ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అనే దానికే 'మేక్ ఇన్ ఇండియా' అని ముద్దు పేరు పెట్టారు. ఈ పథకం దేశ స్వావలంబన విధానానికి పూర్తి భిన్నమైంది. జాతీయోద్యమ స్ఫూర్తికి విరుద్ధమైంది. బ్రిటీష్ వలస పాలన కాలంలో దేశంలోని సహజ వనరులను, శ్రామికుల శ్రమను లూటీ చేసి, దేశీయ పరిశ్రమలను ఏ రకంగా సర్వనాశనం చేశారో ఆలాగే మరోసారి కొల్లగొట్టడానికి సామ్రాజ్యవాద దేశాలు రూపొందించిన ముసుగు ఇది. నకిలీ జాతీయ వాదులు ఎత్తుకున్న మరో మోసపూరిత విధానం, నినాదం 'మేక్ ఇన్ ఇండియా'. దేశంలో 1991 తర్వాత అనుసరించిన ప్రపంచీకరణ విధానాల వల్ల కొన్ని రంగాల్లో సాధించిన అభివృద్ధి తీవ్రమైన అసమానతలతో కూడుకున్నది. ఒకవైపు దేశ సంపద పెరుగుతున్నట్లు లెక్కలు చెబుతుంటే మరోవైపు నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు తీవ్రమయ్యాయి. సంపద కొద్దిమంది దగ్గరే పోగైంది. ప్రఖ్యాత ప్రపంచ ఆర్థికవేత్త ప్రొఫెసర్ పికెటి బృందం చెప్పిన ప్రకారం 1924 నాటి కంటే 2024 నాటికి దేశంలో ఆర్థిక అసమానతలు ఎక్కువగా పెరిగాయి. ఐ.టి రంగంలో గత రెండు దశాబ్దాల్లో సాధించిన వృద్ధి వల్ల 2013 నాటికి భారత ఆర్థిక వ్యవస్థలో సేవల రంగం వాటా 57 శాతానికి పెరిగినప్పటికీ, ఆ రంగం అతి తక్కువ మందికి మాత్రమే ఉద్యోగాలను కల్పించింది. ప్రస్తుతం ఆ రంగంలో ఉపాధి అవకాశాలు మరింతగా తగ్గిపోతున్నాయి. అలాగే దేశ ఆర్థిక వ్యవస్థలో తయారీ రంగం వాటా కేవలం 15 శాతం మాత్రమే ఉంది. దేశ జనాభాలో సగం మందికి పైగా వ్యవసాయ రంగంపై ఆధారపడి వున్నారు. అయితే ఆ రంగం గత కొన్ని దశాబ్దాలుగా తీవ్ర సంక్షోభంలో వుంది. నిరుద్యోగం, వలసలు పెద్ద ఎత్తున పెరిగిపోయాయి. ఈ పరిస్థితులకు కారణమైన ప్రపంచ బ్యాంకు ఆదేశిత ఆర్థిక విధానాలను సమీక్షించకుండా ఆ బ్యాంకు చెప్పిన 'మేక్ ఇన్ ఇండియా' ఎలా పరిష్కారం అవుతుంది? దేశంలో తయారీ (ఉత్పత్తి) పరిశ్రమలను పెంచడం ద్వారా ఉద్యోగ అవకాశాలు పెరిగి, దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా, వేగంగా అభివృద్ధి సాధిస్తుందని బిజెపి నాయకులు చెప్పారు. రోగం ఒకటైతే మందు మరొకటి వేశారు. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా తయారీ రంగాన్నీ అభివృద్ధి చేస్తామని చెప్పి రైల్వే, బీమా, రక్షణ, వైద్య పరికరాల తయారీలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు భారీగా అనుమతించారు. కీలకమైన రక్షణ రంగంలో అప్పటి వరకు 49 శాతంగా ఉన్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 74 శాతానికి పెంచి తమ నిజమైన 'దేశభక్తి'ని చాటుకున్నారు. నిర్మాణం, రైల్వే, ఇతర మౌలిక సదుపాయాల రంగాలలోకి నూరు శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించారు. ఈ విదేశీ పెట్టుబడికి సేవలు చేయడానికి 'ఇన్వెస్టర్ ఫెసిలిటేషన్ సెల్'ను ఏర్పాటు చేశారు. దేశంలోకి పెట్టుబడి వచ్చినప్పటి నుండి తిరిగి వెళ్లే వరకు అవసరమైన అన్నిరకాల సేవలను ఈ సెల్ చేస్తుంది. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' పేరుతో విదేశీ పెట్టుబడులు దేశంలో వ్యాపారం చేసుకోవడానికి అవసరమైన అనుమతులు, లైసెన్స్‌లు, విద్యుత్ సదుపాయం, పన్నుల చెల్లింపులు, ఒప్పందాలకు అవసరమైన అన్ని రకాల సేవలు (ఊడిగం) చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఇందులో ఆసక్తికరమైన 'దివాలా తీయడం' సేవ కూడా వుంది. దివాలా తీయడానికి కూడా సేవలు అందించే ఏర్పాట్లు ఈ పుణ్యభూమిలో తప్ప ఎక్కడ వుండవేమో! ఈ విధానాలను మూడు 'పి' లుగా (పబ్లిక్ (ప్రభుత్వం) ప్రైవేట్ పార్టనర్‌షిప్) పిలుచుకున్నారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి ఇటీవల నాలుగో 'పి' కూడా చేర్చారు. 'పదకొండు ప్రభుత్వ అనుమతులను లేదా సేవలను సింగిల్-విండో ద్వారా చేసిపెడుతున్నారు. ఇన్ని రకాల సేవలు పొందిన విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారులు ఐదు పారిశ్రామిక కారిడార్ల ద్వారా పారిశ్రామిక, పట్టణీకరణ అభివృద్ధికి కృషి చేస్తారని చెప్పారు. ఢిల్లీ-ముంబై, అమృత్‌సర్-కోల్‌కొతా, చెన్నై-బెంగళూరు, వైజాగ్-చెన్నై పారిశ్రామిక కారిడార్లు, బెంగళూరు-ముంబై ఆర్థిక కారిడార్లను ఏర్పాటు చేశారు. స్కిల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియా, ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన, స్మార్ట్ సిటీలు, అమృత్ కాల్, స్వచ్ఛ భారత్ అభియాన్, సాగరమాల ఇలా ఒకటేమిటి అనేక పేర్లు పెట్టి దేశాన్ని ఊదరగొట్టారు. ఇంత చేసి సాధించింది ఏమిటంటే తిరోగమనం. నేషనల్ అకౌంట్స్ స్టాటిస్టిక్స్ (ఎన్.ఎ.ఎస్) ప్రకారం తయారీ రంగం వాస్తవ అభివృద్ధి రేటు 2001-12లో 9.1 శాతం వుండగా, మేక్ ఇన్ ఇండియా అమలులోకి వచ్చిన 2012-23లో 5.5 శాతానికి పడిపోయింది. జిడిపిలో తయారీ వాటా 25 శాతానికి పెంచాలనే ఈ పథకం లక్ష్యం ఇప్పటికీ 17-18 శాతానికి దాటలేదు. తయారీ రంగంలో ఉద్యోగ అవకాశాలను పెంచడం ద్వారా దేశం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. తయారీ రంగంలో 2011-12లో ఉద్యోగ అవకాశాలు 12.6 శాతం వుండగా 2022-23 నాటికి 11.4 శాతానికి పడిపోయింది. మన రాష్ట్రంలో 2018-19లో 10.6 శాతంగా వున్న ఉపాధి అవకాశాలు 2023-24 నాటికి 9.6 శాతానికి పడిపోయాయి. అలాగే కర్ణాటకలో 11.7 నుండి 10.9 శాతానికి, తమిళనాడులో 18.7 నుండి 15.9 శాతానికి, పశ్చిమ బెంగాల్‌లో 18.7 నుండి 16.7 శాతానికి ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయి. దేశంలో వ్యవసాయం తర్వాత అత్యధికమంది ఉపాధి పొందుతున్నది అసంఘటిత రంగంలో. ఈ రంగంలో 2015-16లో 38.8 మిలియన్ల మంది ఉపాధి పొందుతుంటే 2022-23 నాటికి 30.6 మిలియన్లకు అంటే సుమారు ఎనిమది లక్షల మంది ఉపాధి కోల్పోయారు. దేశ స్థూల జాతీయోత్పత్తిలో భారతదేశ ఎగుమతులు 2013-14లో 25.2 శాతం వుండగా, 2013-24లో 22.7 శాతానికి పడిపోయాయి. దిగుమతులు మాత్రం 602.98 మిలియన్ డాలర్ల నుండి 2022 నాటికి 756.68 మిలియన్ డాలర్లకు పెరిగాయి. పట్టణాల్లో ఉపాధి తగ్గిపోవడంతో వ్యవసాయంపై ఆధారపడే వారి సంఖ్య పెరిగింది. 2018-19లో 42.5 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడితే 2022-23లో 45.8 శాతానికి పెరిగింది. ఈ పది సంవత్సరాల్లో అభివృద్ధి సాధించక పోగా దేశ సహజ వనరులు పెద్ద ఎత్తున లూటీ అయ్యాయి. వ్యవసాయ యోగ్యమైన భూమిని స్వదేశీ, విదేశీ కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడం పెరిగింది. ఒక్కో కార్పొరేట్ కంపెనీకి వేల ఎకరాల భూమిని ఇచ్చేస్తున్నారు. పారిశ్రామిక కారిడార్ల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భూ బ్యాంక్ విధానం పేరుతో చిన్న, సన్నకారు రైతుల భూములను అతి చౌకగా కాజేశారు. దీనివల్ల ఇప్పటికే ఆహారధాన్యాల కొరత ఏర్పడింది. రానున్న రోజుల్లో మరింతగా పెరిగే అవకాశం ఉంది. గతంలో అమెరికా నుండి పి.ఎల్-480 గోధుమలను దిగుమతి చేసుకున్న స్థితికి దేశం దిగజారుతుంది. గాలి, సూర్యరశ్మి ద్వారా విద్యుత్ ఉత్పత్తి పేరుతో గ్రామీణ ప్రాంతాలపై పడుతున్న విభిన్న ప్రతికూలతల గురించి ఎలాంటి అధ్యయనంకానీ, జాగ్రత్తలుకానీ తీసుకోవడంలేదు. పారిశ్రామికీకరణ పేరుతో పెద్ద ఎత్తున కొండలు, గుట్టలు చదును చేయడంతో పాటు సహజ వనరులను కొల్లగొడుతున్నారు. దీనివల్ల కాలుష్యం, పర్యావరణం దెబ్బ తిని ప్రతికూల ప్రభావాలు పడుతున్నాయి. సకాలంలో వర్షాలు రాకపోవడంతో పాటు, వాతవారణంలో తీవ్రమైన మార్పులు వచ్చాయి. జాతీయోద్యమ లక్ష్యాలకు భిన్నమైన ఈ 'మేక్ ఇన్ ఇండియా' దేశాన్ని విదేశీ, స్వదేశీ కంపెనీలకు దోచిపెట్టడానికి తోడ్పడింది. మన దేశాన్ని మనం అభివృద్ధి చేసుకోవాలనే నాటి స్ఫూర్తికి భిన్నంగా రక్షణ రంగంతో సహా అన్ని రంగాల్లోకి విదేశీ పెట్టుబడులకు తలుపులు తెరచింది. బ్రిటీష్ కాలం నాడు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కుదించివేసి కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చడానికి, వ్యవసాయ రంగంలో నల్ల చట్టాలను తెచ్చి కార్పొరేట్ కంపెనీలకు కేంద్ర బిజెపి ప్రభుత్వం సేవలు చేస్తున్నది. దేశం నిజంగా అభివృద్ధి కావాలంటే ఇప్పటికీ అత్యధిక మంది ఆధారపడిన వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలి. భూ పంపిణీ చేపట్టి గ్రామీణ ఉపాధి అవకాశాలను పెంచాలి. సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణం, ప్రభుత్వ రుణ సదుపాయం, గిట్టుబాటు ధరలు కల్పించాలి. కుల, లింగ వివక్షలను రూపుమాపే శాస్త్రీయ విద్య, సామాజిక వ్యవస్థను అభివృద్ధి చేయాలి. పట్టణాల విస్తరణకు అవసరమైన చిన్న, మధ్యతరహా పరిశ్రమలను పెద్ద ఎత్తున స్థాపించడానికి అవసరమైన తోడ్పాటును ఇచ్చి ఉద్యోగ అవకాశాలు పెంచాలి. పరిశోధనల అభివృద్ధికి అవసరమైన నిధులను బడ్జెట్‌లో కేటాయించాలి.

# ఈ తీర్పు విలక్షణం!

ఓటర్ల మదిలో ఏముంటుందో, ఎవరికి, ఎందుకు పట్టం గడతారో ఊహించడం కష్టసాధ్యమైన విషయమని మరొకసారి నిరూపితమైంది. లోక్‌సభ ఎన్నికల తర్వాత తాజాగా జరిగిన జమ్మూకశ్మీర్, హర్యానా ఎన్నికలు సంచలన విజయాలను నమోదు చేశాయి. ఒకటి రెండు మినహా మిగిలిన సర్వే సంస్థలన్నీ గంపగుత్తగా హర్యానాలో కాంగ్రెస్‌కు పట్టం కట్టగా, జమ్మూకశ్మీర్‌లో హంగ్ ఏర్పడే అవకాశం ఉందని తేల్చేశాయి. కాగా, ఈ ఎగ్జిట్ పోల్స్ అంచనాలను వమ్ము చేస్తూ, ప్రజలు వినూత్నమైన తీర్పునిచ్చారు. జమ్మూకశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్-కాంగ్రెస్ కూటమికి, హర్యానాలో మరొకసారి బిజెపికి అధికారాన్ని అప్పగిస్తూ తీర్పు చెప్పారు. దాదాపు పదేళ్ల తర్వాత జమ్మూకశ్మీర్ ప్రజలు సెప్టెంబర్ 18- అక్టోబర్ 1 మధ్య మూడు విడతలుగా జరిగిన ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఎన్నికలు అటు ప్రాంతీయ పార్టీలకు, ఇటు జాతీయ పార్టీలకు కూడా సవాల్‌గా నిలిచాయి. జమ్మూకశ్మీర్‌లో ఏళ్ల తరబడి ప్రాంతీయ పార్టీలే ఆధిపత్య చెలాయిస్తూ వస్తున్నాయి. ఎన్నికలు ఎప్పుడు జరిగినా అబ్దుల్లాలు, ముఫ్తీల మధ్య పోటీ హోరాహోరీగా సాగుతుంది. ఈసారి వీటితో పాటు కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీల ప్రభావం కూడా బాగా కనిపించింది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 2019లో ఆర్టికల్ 370ని రద్దు చేసి, జమ్మూ కశ్మీర్‌ను రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా మార్చడంతో రాజకీయ సమీకరణలు కూడా మారాయి. జాతీయ సమగ్రత, భద్రత దృష్ట్యా తాము తీసుకున్న ఈ నిర్ణయం జమ్మూ కశ్మీర్ ప్రజలకు ఉజ్వల భవితను ప్రసాదిస్తుందని బిజెపి సగర్వంగా చెప్పుకోగా, ఆర్టికల్ 370 రద్దును కాంగ్రెస్ గట్టిగా ప్రతిఘటిస్తూ, అధికారంలోకి వస్తే జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని స్పష్టం చేసింది. నిరుద్యోగం, జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా, ధరల పెరుగుదల వంటి అంశాలు ఓటర్లపై ప్రభావం చూపాయి. గత ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్‌ను కాదని విడిగా పోటీ చేసి పరాజయం పాలైన కాంగ్రెస్ ఈసారి ఎన్‌సితో జత కట్టి బరిలోకి దిగడం లాభించింది. ఈ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ ఆధిక్యం స్పష్టంగా కనిపించింది. ఇక 2014లో పిడిపి తో కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బిజెపి ఈసారి విడిగా పోటీ చేసి, గతంలో కంటే ఎక్కువ సీట్లనే సంపాదించుకుంది. ఈసారి పిడిపి అంతగా ప్రభావం చూపకపోగా, జమ్మూకశ్మీర్, హర్యానాలలో ఒంటరిగా పోటీ చేసిన ఆప్.. దోడా స్థానం నుంచి గెలిచి కశ్మీర్‌లో ఖాతా తెరిచింది. సోపోర్ ప్రాంతంలోని 10 నియోజక వర్గాల్లో స్వతంత్ర అభ్యర్థుల్ని పోటీకి నిలిపిన జమాతే ఇస్లామీ (జమ్మూకశ్మీర్) ప్రభావం కూడా ఈ ఎన్నికల్లో అంతగా కనిపించలేదు. హర్యానాలో రెండు పర్యాయాలుగా అధికారంలో ఉన్న బిజెపి, హ్యాట్రిక్ సాధించడం విశేషమే. లోక్‌సభ ఎన్నికలకు ముందు మనోహర్ లాల్ ఖట్టర్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి దింపి, సైనీకి ఆ పదవి కట్టబెడుతూ బిజెపి చేసిన ప్రయోగం వికటించింది. అంతకు ముందు పదికి పది స్థానాలు గెలుచుకున్న బిజెపి, ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ఐదు స్థానాలకే పరిమితమైంది. అసెంబ్లీ ఎన్నికలు వచ్చే సరికి ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగా ఉందనీ, కాంగ్రెస్ గెలుపు ఖాయమనీ ప్రచారం జరిగింది. దీంతో కమలనాథులు హర్యానాలో గెలుపుకోసం చెమటోడ్చారు. జాట్లలో అధిక సంఖ్యాకులు కాంగ్రెస్‌కు మద్దతు పలకడంతో మిగిలిన కులాల ఓట్లు రాబట్టేందుకు బిజెపి రచించిన వ్యూహాలు ఫలించాయనడానికి తాజా ఫలితాలే నిదర్శనం. గడచిన లోక్‌సభ ఎన్నికల్లో 'అబ్ కి బార్ చార్ సౌ పార్' నినాదంతో పోటీ చేసిన బిజెపి, ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన మేజిక్ ఫిగర్‌ను సాధించలేకపోయింది. తాజాగా జరిగిన ఎన్నికల్లో జమ్మూ కశ్మీర్‌లో ఓటమిని మూటగట్టుకుని, హర్యానాలో మూడో దఫా గెలిచిన కమలనాథులకు ముసల్ల పండుగ ముందుంది. త్వరలో మహారాష్ట్ర, జార?ండ్, ఢిల్లీ రాష్ట్రాలకు, వచ్చే ఏడాది బీహార్‌కు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బిజెపి నేతల వ్యూహాలు ఎలా ఉంటాయో వేచి చూడవలసిందే. వీటితో పాటు ఉత్తరప్రదేశ్‌లో పది అసెంబ్లీ సీట్లకు త్వరలో జరగబోయే ఉప ఎన్నికలు కూడా ఆసక్తి గొలుపుతున్నాయి.



# పెరుగుతున్న వ్యవసాయ కూలీలు తగ్గుతున్న గ్రామీణ ఉపాధి!

నేటికీ వ్యవసాయ రంగం దేశానికి కీలకంగా ఉంది. సేద్యపు పనుల్లో, పంటల ఉత్పత్తిలో వ్యవసాయ కూలీలు, చిన్న, సన్నకారు రైతాంగం ముఖ్య భూమిక వహిస్తున్నారు. వీరు పొలంలో కష్టపడితేనే సేద్యం ముందుకు సాగుతుంది. ప్రజల అవసరాలు తీర్చే విధంగా ఆహార పంటల ఉత్పత్తి జరుగుతుంది. వ్యవసాయ రంగానికి ఇంత కీలకమైన వ్యవసాయ కూలీల, చిన్న రైతుల పరిస్థితులు మాత్రం దుర్భరంగా మారాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం భూమి లేని వ్యవసాయ కూలీల సంఖ్య 14 కోట్లుగా ఉంది. ఇప్పుడు ఈ వీరి సంఖ్య బాగా పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో 35.5 కోట్ల మంది కూలీలు ఉండగా, వారిలో 61.5% మంది వ్యవసాయ రంగంలో, 20% పారిశ్రామిక రంగంలో పని చేస్తున్నారు. మిగతా కూలీలు వివిధ రంగాల్లో పని చేస్తున్నారు. దేశంలో వ్యవసాయ కూలీల సంఖ్య నిరంతరం పెరుగుతూనే ఉంది. అందుకు కారణం పాలకు ప్రభుత్వాలే. పాలకుల విధానాల మూలంగా వ్యవసాయం గిట్టుబాటు కాక రైతాంగం అప్పుల పాలై ఉన్న కొద్ది పాటి భూమిని అమ్ముకుని ఇతరుల పొలాల్లో కూలీలుగా పని చేస్తున్నారు.

## వ్యవసాయ రంగంలో మహిళలు

దేశ గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ప్రజల్లో 72% మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. తాజా గణాంకాల ప్రకారం దేశంలోని 84% మంది మహిళలు జీవనాధారం కోసం వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉన్నారు. అందులో 33% రైతులు కాగా, 47% మంది రైతు కూలీలు ఉన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలోని మొత్తం మహిళా కార్మికుల్లో 55% మహిళలు కూలీలుగా ఉన్నారు. 24% మంది సాగు చేసే రైతులుగా ఉన్నారు. ఇప్పుడు దేశంలో మహిళా కార్మికుల సంఖ్య గణనీయంగా పెరిగి ఉంటుంది. 2011 తర్వాత జనాభా లెక్కలు జరగక పోవటంతో వివరాలు అందుబాటు లేవు. వ్యవసాయ పనులు సీజనల్ వారీగా జరుగుతాయి. నాట్లు, కోతలు, కుప్పలు వేయటం, నూర్చటం, రబీలో వరి నాట్లతో పాటు మొక్కజొన్న, జొన్న తదితర పంటల విత్తనాలు వేయటం, ఆ పంటలు కోయటం సీజన్ పనులుగా ఉన్నాయి. ఈ పంటలతో పాటు మిర్చి, పత్తి, వేరుశనగ పంటలు కూడా సాగు చేస్తున్నారు. 1990 వరకు సంవత్సరంలో వ్యవసాయ పనులు 120 రోజుల వరకు ఉండేవి. క్రమంగా కూలీల సంఖ్య పెరగటం, ప్రాంతాలను బట్టి పనులు ప్రారంభం కావటం, ముందుగా పనులు ప్రారంభమైన ప్రాంతాలకు మిగతా ప్రాంతాల పేదలు పనులకు వెళ్లటంతో కూలీల సంఖ్య పెరిగి త్వరగా పనులు కావటమే కాకుండా, పని దినాలు తగ్గుతూ వచ్చాయి. ఆ తర్వాత కాంట్రాక్ట్ పని, అవసరానికి మించి సేద్యంలో యంత్రాల వినియోగంతో లభించే ఉపాధిలో సగం పని దినాలు కూలీలు కోల్పోయారు. ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల్లో యంత్రాలే 80 శాతం పైగా పనులు పూర్తి చేస్తున్నాయి. వ్యవసాయ కూలీలకు నామ మాత్రపు పనులే లభిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఒక్కో సీజన్‌లో 15 లేక 20 మించి పనులు లభించటం లేదు. సీజన్ -సీజన్ మధ్య ఏర్పడే విరామ సమయంలో ఎటువంటి పనులు ఉండవు. భారత దేశంలో వేళ్ల మీద లెక్కించబడిన వారి సంపద వేల కోట్లు పెరుగుతుంటే, పంటల ఉత్పత్తికి కారకులైన వ్యవసాయ కూలీల, కూలీ రేట్లు ఏడాదిలో 15 రూపాయల పెరుగుదల మాత్రమే ఉందని కేంద్ర కార్మిక శాఖ పరిధిలోని లేబర్ బ్యూరో చెప్పింది. 2017 నుంచి వ్యవసాయ కూలీల ఆదాయం ఎంత పెరిగిందనే దానిపై లేబర్ బ్యూరో గణాంకాలను రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా బయటపెట్టింది. వ్యవసాయ రంగంలో ఉపాధి క్షీణించటం వలన పురుష కూలీలు, పేద రైతులు ఉపాధి కోసం పట్టణాలకు వలసలు పోవటంతో వ్యవసాయ రంగంలో సాగుదారులుగా, కూలీలుగా మహిళలు ముఖ్య భూమిక పోషిస్తున్నారు. 2017 వ్యవసాయ కూలీల దినసరి సగటు కూలి 266 రూపాయలుగా ఉండగా, 2022 ఆగస్టులో 342 పెరిగింది. ఈ కాలంలో ధరల సూచిక 899 పాయింట్ల నుంచి 1152 పాయింట్లకు పెరిగింది. మహిళా కూలీల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. వీరి దినసరి కూలి 271 రూపాయలు మాత్రమే. కూలీ రేట్లు పెరిగినట్లు పైకి మాత్రమే కన్పిస్తుంది. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో పోలిస్తే వాస్తవ దినసరి వేతనం పురుషులకు 207, మహిళలకు 160 రూపాయలకు తగ్గింది. కూలీ రేట్ల నిర్ణయంలోనూ కుల వివక్ష కొనసాగుతూనే ఉందని లేబర్ బ్యూరో నివేదికలో బయటపడింది. 2022 ఆగస్టులో తీసిన లెక్కల ప్రకారం ఎస్‌సిల పురుష కూలీల రోజు వారీ సగటు కూలి 290 రూపాయలు, మహిళల కూలి 269 రూపాయలుగా ఉంది. ద్రవ్యోల్బణం, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరల కోణంలో చూస్తే వీరి కూలీ రేట్లు తక్కువగా ఉంటాయి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి పథకం కూడా గ్రామీణ పేదల ఉపాధి సమస్యను పరిష్కరించలేకపోయింది. వంద దినాల పని కల్పించటంలో మోడీ ప్రభుత్వం వైఫల్యం చెందింది. జాబ్ కార్డు పొందిన వారిలో 33% మించి పనులు లభించలేదు. ఈ పథకంలో సాంకేతిక పద్ధతి అమలు చేస్తున్న ఫలితంగా పరిస్థితి గందరగోళంగా మారింది. మొబైల్ యాప్ ద్వారా కూలీల హాజరు నమోదు, కూలీల డబ్బుల చెల్లింపుల్లో జాప్యం లాంటి సమస్యలతో విసిగిపోయి చాలా మంది ఉపాధి పనులు మానుకుని వేరే పనులకు చేసుకుంటున్నారు. లభించే కూలీ కూడా చాలా తక్కువగా ఉంది. 2022లో లభించిన రోజు కూలి 209 రూపాయలు కాగా, 2023లో 218 రూపాయలుగా ఉంది. పెరిగిన ద్రవ్యోల్బణం ప్రకారం లెక్కలు వేస్తే లభించే కూలి 122 రూపాయలు మాత్రమే. ఇది వ్యవసాయ పనులకు లభించే కూలి కన్నా 100 రూపాయలు తక్కువ. ఈ కూలీ కూడా అనేక రాష్ట్రాల్లో లభించడం లేదు. పెరుగుతున్న నిరుద్యోగం వల్ల తక్కువ కూలైనా లక్షలాది గ్రామీణ పేదలు పని చేస్తున్నారు. దీన్ని గమనిస్తే ఉపాధి సమస్య తీవ్రత తెలుస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల అతి తక్కువ ఆదాయం పొందుతూ దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారు. ఆర్థిక సర్వే ప్రకారం, అనారోగ్య పరిస్థితుల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందక పేదలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళితే వారికి లభించే ఆదాయం చాలక అప్పుల పాలు చేస్తున్నారు. మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్ ఆధ్వర్యంలోని జాతీయ గణాంకాల కార్యాలయం గతంలో నిర్వహించిన సర్వే ప్రకారం 50 శాతం పైగా వ్యవసాయ కూలీ కుటుంబాలు అప్పుల్లో ఉన్నారని తేలింది. గ్రామీణ పేదలు, వ్యవసాయ కూలీల పేదరికానికి, వారి కుటుంబాలు దుర్భర పరిస్థితులకు సేద్యపు భూమికి విడదీయరాని సంబంధం ఉంది. భూమి గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే ఉత్పత్తి సాధనం. అధికార మార్పిడి జరిగి దశాబ్దాలు గడుస్తున్నా పంట ఉత్పత్తులకు మూల కారణమైన పేదలకు సేద్యపు భూమి దక్కలేదు. అర్ధభూస్వామ్య వ్యవస్థకు ప్రాతినిధ్య వహించిన, వహిస్తున్న పాలక ప్రభుత్వాలు చేసిన భూ సంస్కరణల చట్టాలు పేదలకు భూమి పంచకపోగా, భూస్వామ్య వర్గాన్ని మరింత పటిష్ట పరిచింది. దేశం పారిశ్రామికంగా అభివృద్ధి కావాలన్నా, ఉపాధి లభించి పేదలు, పేదరికం నుంచి బయట పడాలన్నా విప్లవ భూ సంస్కరణల ద్వారా పేదలకు భూ పంపిణీ జరగాలి. భూస్వామ్య, బడా పెట్టుబడిదారులకు ప్రాతినిధ్యం వహిస్తున్న పాలక ప్రభుత్వాలేవి అలాం టి భూసంస్కరణలు అమలు జరపవు. ప్రజలే పోరాడి సాధించుకోవాలి.



